FLASH INDIA NEWS ప్రశ్నించు.. ప్రజలకోసం...

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 143 | గురువారం 09.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039




# తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..

## రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

**గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌లకు తెలంగాణ సిద్ధం**

తెలంగాణపై విదేశీ కంపెనీల ఫోకస్


- ఖమ్మంలో రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్
- గోద్రేజ్ పెట్టుబడితో 700 మందికి ఉపాధి అవకాశాలు
- తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ప్రతినిధుల ఆసక్తి
- సీఎం రేవంత్‌తో గోద్రేజ్ ప్రతినిధుల కీలక భేటీ
- ఖమ్మం ప్రాజెక్టుకు రోడ్డు విస్తరణకు సీఎం ఆదేశాలు
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు ఆహ్వానం
- విదేశీ పెట్టుబడులతో తెలంగాణ అభివృద్ధికి ఊతం
- అంతర్జాతీయ ప్రతినిధులతో సీఎం రేవంత్ కీలక చర్చలు
- ఆయిల్ పామ్ విస్తరణపై గోద్రేజ్ నివేదిక సమర్పణ
- తెలంగాణపై విదేశీ పెట్టుబడిదారుల విశ్వాసం పెరుగుతోంది 03

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు వి స్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు.ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం...

# కొత్త కేటాయింపు కాదు

## సింగరేణి బొగ్గు గనుల వివాదం.. కేంద్ర ప్రకటనలపై డిప్యూటీ సీఎం ఫైర్

తాడిచెర్ల-2 బ్లాక్ కొత్త కేటాయింపు కాదని స్పష్టం



- సింగరేణిపై కేంద్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్న భట్టి
- 2013లోనే సింగరేణికి బ్లాక్ కేటాయించారు
- మైనింగ్ లీజు ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- సీఎం రేవంత్‌తో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్న భట్టి
- అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పోరాడిందని వ్యాఖ్య
- కోయగూడెం బ్లాక్‌ను ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం తప్పుబట్టిన భట్టి 02
- సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు సింగరేణికే ఇవ్వాలని డిమాండ్
- కేంద్ర ద్వంద్వ వైఖరిపై భట్టి విక్రమార్క తీవ్ర విమర్శలు
- సింగరేణికి న్యాయం చేయాలంటే బొగ్గు గనులు కేటాయించాలి

**బీఆర్ఎస్ హయాంలో సింగరేణికి అన్యాయం**

# రేవంత్, ఉత్తమ్‌ని ఉరితీసినా తప్పు లేదు..



## రేవంత్.. అబద్ధాల్లో 'నోబెల్ ప్రైజ్' నీకే!

- పొరుగున ఉన్న చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే
- చెరువులు నింపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమన్న హరీశ్
- నీళ్ల విడుదలపై రేవంత్‌ను నిలదీసిన హరీశ్ రావు
- దేవాదుల మోటార్లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్న
- రేవంత్, ఉత్తమ్ ఇద్దరూ ఫెయిలయ్యారన్న హరీశ్
- అబద్ధాల్లో రేవంత్‌కు నోబెల్ వస్తుందన్న హరీశ్ 03
- కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన హరీశ్
- మేడిగడ్డపై కుంటిసాకులు చెబుతున్నారన్న హరీశ్ ఆరోపణ
- తమ్మిడిహట్టి పత్రాలు చూపాలని రేవంత్‌కు సవాల్
- నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలపై హరీశ్ విమర్శలు



# ఇక చర్చలు ఉండవ్

ఇరాన్ క్షమించరాని తప్పులు చేస్తోంది..

ఇక దాడులే.. ట్రంప్ ప్రకటనతో మళ్లీ ఉద్రిక్తతలు

- ఇరాన్‌తో చర్చలు ముగిశాయని ట్రంప్ స్పష్టమైన ప్రకటన
- శాంతి ఒప్పందం ఇక అమల్లో లేదన్న ట్రంప్ వ్యాఖ్యలు
- ట్రంప్ ప్రకటనతో ప్రపంచ మార్కెట్లు భారీగా కుదేలయ్యాయి
- అమెరికా దాడులతో మళ్లీ ఉద్రిక్తమైన ఇరాన్ యుద్ధ వాతావరణం
- ఇరాన్ రాకెట్ దాడులకు అమెరికా గట్టి ప్రతిస్పందన తెలిపింది 02
- ముడిచమురు ధరలు పెరిగి ప్రపంచ ఆర్థిక ఆందోళనలు ప్రారంభం




# సమష్టి కృషే కీలకం

డ్రగ్స్ రహిత సమాజం కోసం కలిసి పోరాడుదాం

ఆరోగ్యకరమైన సమాజమే ప్రభుత్వ సంకల్పం

- విద్యార్థులే డ్రగ్స్ ముఠాల ప్రధాన లక్ష్యమని హెచ్చరిక
- డ్రగ్స్ సమాచారానికి టోల్ ఫ్రీ 1908 వినియోగించాలన్న సూచన
- నషా ముక్త్ భారత్ అభియాన్‌పై సమగ్ర అవగాహన కార్యక్రమం 05
- డ్రగ్స్ వ్యాపారులపై కఠిన చర్యలే లక్ష్యమని స్పష్టం
- వ్యసన బాధితులకు పునరావాసం కల్పించడం కూడా ముఖ్యమని వ్యాఖ్య

# వారం రోజుల్లో సమాధానం..

## అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు?




- పార్టీ పేరుపై అభ్యంతరాలు ఇవ్వాలని కోర్టులో విజ్ఞప్తి
- ముందు ఈసీకి బదులివ్వాలని హైకోర్టు ఆదేశం
- పార్టీ పేరు వివాదంపై హైకోర్టులో కీలక విచారణ
- ఈసీ హియరింగ్ అవకాశం ఇవ్వాలని కోర్టు ఆదేశాలు
- అభ్యంతరాల వివరాలు ఇవ్వాలన్న తెలంగాణ రక్షణ సేన
- పార్టీ పేరుపై కవిత ఈసీ ఎదుట వివరణ ఇవ్వనున్నరు
- అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకని పార్టీ ప్రశ్న
- పార్టీ రిజిస్ట్రేషన్‌పై న్యాయపోరాటం కొనసాగిస్తున్న టీఆర్ఎస్
- న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేసిన పార్టీ
- పార్టీ పేరుపై ఈసీతో న్యాయపోరాటం ముమ్మరం 03
- హైకోర్టు సూచనతో ఈసీకి వారంలో సమాధానం

# డైవర్షన్ కే కాళేశ్వరం డ్రామా

- ధరణి, భూభారతిపై సిట్ విచారణ జరపాలని బీజేపీ డిమాండ్
- ధరణి అక్రమాలు నిజమేనన్న బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శ
- కాళేశ్వరం వివాదం డైవర్షన్ రాజకీయాలేనన్న బీజేపీ
- తాటిచర్ల-2 గని బీజేపీ కృషి ఫలితమేనన్న రామచందర్ రావు
- సింగరేణిని కాపాడింది బీజేపీ ప్రభుత్వమేనని వ్యాఖ్య
- తాటిచర్ల గని కేటాయింపుకు కేంద్రానికి బీజేపీ కృతజ్ఞతలు
- భూభారతి అవకతవకలపైనా సిట్ విచారణ కోరిన బీజేపీ 03
- రైతుల కోసం కాళేశ్వరం మరమ్మతులు చేపట్టాలని సూచన
- తాటిచర్ల గనిపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- కిషన్ రెడ్డి కృషితోనే తాటిచర్ల గని కేటాయింపని వ్యాఖ్య
- ధరణి అవకతవకలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలు

**ధరణి, భూభారతి అక్రమాల డైవర్షన్ కే కాళేశ్వరం డ్రామా**



# ఆ మాత్రం తేడా తెలియకపోతే ఎలా..

## "నేనేం తప్పు చేయలేదు".. కడియం శ్రీహరి

ఎవరికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు

కాంగ్రెస్‌లో మంత్రి, ఎమ్మెల్యే మధ్య మరోసారి మాటల యుద్ధం

- మంత్రి ఆరోపణలకు కడియం శ్రీహరి కౌంటర్
- సురేఖ ఫిర్యాదుపై కడియం ఘాటు స్పందన
- సమీక్ష చేయలేదన్న కడియం శ్రీహరి
- అధికారులను కలవడం తప్పుకాదన్న కడియం
- దేవాదాయ శాఖ వివాదం కాంగ్రెస్‌లో కలకలం
- మంత్రి, ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం
- ఆలయాల అభివృద్ధికే వెళ్లానన్న కడియం
- వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్న కడియం
- కడియం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ చర్చ
- దేవాదాయ శాఖలో రాజకీయ దుమారం కొనసాగుతోంది 03

# అప్పుడు మంత్రివి, మేస్త్రివి అన్ని నువ్వే కదా?



**హరీశ్‌కు జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్**

- కాళేశ్వరం కూలిపోతే బాధ్యత మీదే
- కాంగ్రెస్‌ను నిందించడం మానండి..
- కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకురండి
- కాళేశ్వరం మీ హయాంలోనే కూలింది..
- ఇప్పుడు మాపై నిందలేంటి? 05

నువ్వు చేసిన కథకు... రేవంత్ రెడ్డి మీద పడితే ఏం లాభం? నీళ్లు స్టోరేజీ పెట్టొద్దు కానీ గత ప్రభుత్వం పెట్టిందని అందుకే కూలిందన్నారు. రేవంత్..ఇంకో ఐదేళ్లు సీఎం మేమే అంటున్నారు కాబట్టి ఆందోళనలో బీఆర్ఎస్ ఉందన్నారు. దొంగ మాటలు...

# రాజకీయాలు మానండి...



- సిద్ధాపూర్ ఏకో పార్క్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే శంకర్ తీవ్ర అభ్యంతరం
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై విమర్శలు
- డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్న ఎమ్మెల్యే
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూసేకరణలో అవకతవకలు జరిగాయని ఆరోపణ
- కాలుష్య పరిశ్రమలకు కాంగ్రెస్ మొదటి నుంచే వ్యతిరేకమని స్పష్టం

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఏకో పార్క్(వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) అంశంపై షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్రస్థాయిలో స్పందించారు. కొందరు రాజకీయ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, తనపై నిరాధార అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డంపింగ్ యార్డ్ పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం కార్యకర్తలతో కలిసి చౌరస్తా వరకు పాదయాత్రగా వచ్చిన ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మీడియాతో మాట్లాడారు. సిద్ధాపూర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి భూములను సేకరించిందని, అనంతరం కాలుష్య పరిశ్రమలను అక్కడికి తరలించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. అప్పటినుంచే కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేటీఆర్ పర్యటనను సైతం అడ్డుకున్నామని, ఆ కేసుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీఎస్ఐఐసీ నుంచి 86 ఎకరాలను జీహెచ్ఎంసీకి బదిలీ చేసిన నేపథ్యంలో ఏకో పార్క్ ప్రతిపాదనపై తాము తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశామని పేర్కొన్నారు. సీఎం, మంత్రులు, టీఎస్ఐఐసీ, జీహెచ్ఎంసీ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశామని, ప్రభుత్వం పూర్తిగా ఈ ప్రతిపాదనను రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు, రైతులు, ప్రజా సంఘాలు కలిసి అఖిలపక్షంగా ఉద్యమించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అయితే కొందరు వ్యక్తులు తనను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, అలాంటి చౌకబారు రాజకీయాలను ప్రజలు నమ్మరని అన్నారు. తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్న వారికి ఎమ్మెల్యే శంకర్ సవాల్ విసిరారు. టీఎస్ఐఐసీ భూములు జీహెచ్ఎంసీకి ప్రభుత్వ జీవో ప్రకారం బదిలీ అయ్యాయని, అందులో ఎమ్మెల్యేకు డబ్బులు ఇచ్చారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. ఆరోపణలు చేసే ముందు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూసేకరణలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఆయన, సుమారు 70 నుంచి 80 ఎకరాల భూములు, రూ. 9 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ హయాంలో ఎలాంటి అవినీతి జరగలేదని బహిరంగంగా ప్రకటిస్తే, అన్ని ఆధారాలను ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు. సిద్ధాపూర్ రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, కాలుష్య పరిశ్రమలు లేదా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇక చర్చలు ఉండవ్

**అమెరికా :** ఇరాన్ తో యుద్ధంపై డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇటీవలే ఇరుదేశాలు స్విట్జర్లాండ్ లో శాంతి ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో 2026 సదస్సు వేదికగా .. ఇరాన్ పై విమర్శలు చేశారు. ఇరాన్ క్షమించరాని తప్పులు చేస్తోందన్న ట్రంప్.. శాంతి ఒప్పందం ముగిసిందని, ఇకపై ఇరాన్ తో ఎలాంటి చర్చలు జరపబోమని, ఆ చర్చలు జరపడం కూడా సమయం వృథా అని కుండబద్దలు కొట్టారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు.. అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం రేపాయి. నాటో చీఫ్ మార్క్ రుట్టెతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఇరాన్ తో కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పంది పూర్తిగా రద్దయినట్లేనా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. నా ఉద్దేశంలో ఇది ముగిసిపోయిందని బదులిచ్చారు. పైగా ఇరానియన్లతో ఇకపై ఎలాంటి చర్చలు జరపాలనుకోవడం లేదని, వారు చాలా కఠినమైన, హింసాత్మకమైన మన స్తత్వంతో ఉన్నారని, వారిని నడిపించే నాయకులు కూడా అలాగే ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా.. ట్రంప్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. సెన్సెక్స్ 1500 పాయింట్లు, నిఫ్టీ 467 పాయింట్లు నష్టాల్లోకి వెళ్లాయి. మరోవైపు ముడిచమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్యారెల్ ముడిచమురు ధర 2 శాతం పెరిగింది. బుధవారం మధ్యాహ్నానికి బ్యారెల్ ముడిచమురు ధర 78.73 డాలర్లకు ఎగబాకింది. మళ్లీ హోర్ముజ్ జలసంధి వద్ద నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందేమోనని ప్రపంచ దేశాల మధ్య భయాలు మొదలయ్యాయి. ఇరాన్ పై మంగళవారం రాత్రి అమెరికా జరిపిన భారీ వైమానిక దాడుల అనంతరం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం మళ్లీ మొదటికి వచ్చింది. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైతం బహ్రెయిన్, కువైట్ తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై సరికొత్త రాకెట్ దాడులకు దిగింది. ఈ దాడులపై స్పందించిన ట్రంప్.. గత రాత్రి ఇరాన్ లోని కొన్ని శక్తులపై దాడులు నిర్వహించామని, గల్ఫ్ ప్రాంతంలో నౌకలపై ఇరాన్ రాకెట్ దాడులకు దిగడం వల్లనే తాము తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.



# తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. వర్షపాతం తక్కువగా ఉండే పరిస్థితుల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. ప్రజలకు నిర్ణీత సమయాల్లో తాగునీరు అందించాలని, ఆ సమయాలను ముందుగానే కాలనీ వాసులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పైపులైన్లలో లీకేజీలు లేకుండా ఇంజనీర్లు నిరంతరం పర్యవేక్షించాలని, లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రతి వారం తాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల చుట్టూ భద్రతా చర్యలలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి పానగల్లు ఉదయ సముద్రానికి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. లైనింగ్ పనుల కారణంగా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా వారం రోజులపాటు పనులను నిలిపివేయాలని, అవసరమైన మేర నీటి నిల్వలు నిండిన తర్వాత తిరిగి పనులు ప్రారంభించుకోవాలని కలెక్టర్ తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, ఈఈ నెహ్రూ నాయక్, ఎస్ ఈ నాగేశ్వరరావు, జాన్ నాయక్, మున్సిపల్ ఈ ఈ వెంకటేశ్వర్లు ,డీఈ లు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కేటాయింపు కాదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో (ట్రైబల్ ఏరియా) ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు అప్రూవల్ (ఆమోదం) ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ఫైళ్లను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలం (ఆక్షన్) లో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3 తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయకుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.

# జనసంద్రంగా మారిన సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం









**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉ టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో తలకొండపల్లి మండల కేంద్రం లోని దేవకి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఐదవ రోజుకు చేరుకుంది . ప్రజల నుంచి అపూర్వ స్పందనతో గ్రామీణ ప్రాంత ప్రజలకు విజయవంతంగా సేవలను అందిస్తున్నారు,ఐదు రోజులుగా శిబిరానికి. 4,300 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 2,520 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ,1,618 మందికిపైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ,142 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు, ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన తలకొండపల్లి ఎస్ఐ శేఖర్ మాట్లాడుతు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడం నిజంగా అభినందనీయమైన విషయమన్నారు,సాధారణంగా కంటి శస్త్రచికిత్సలు చేయించుకోవడానికి పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటాయని, అలాంటి వారికి ఎలాంటి ఖర్చు లేకుండా కంటి పరీక్షలు, ఉచిత కంటి అద్దాలు, అవసరమైన వారికి శుక్లాల శస్త్రచికిత్సలు అందించడం ఎంతో గొప్ప సేవ అని కొనియాడారు,సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రజా సేవను బాధ్యతగా భావిస్తూ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని, వేలాది మంది ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు, ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు, అనంతరం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందన ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు,ఐదు రోజుల వ్యవధిలోనే వేలాది మంది శిబిరాన్ని సందర్శించి ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాలు, శుక్లాల శస్త్రచికిత్సల సేవలను పొందడం ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు,గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.,ఈ నెల 10వ తేదీ వరకు ఉచిత కంటి పరీక్షలు, 12వ తేదీ వరకు కంటి శుక్లాల శస్త్రచికిత్సలు కొనసాగనున్నందున తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు,భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించే దిశగా సుంకిరెడ్డి కృషి కొనసాగుతుందని తెలిపారు.

**(ఐదవ రోజు) వివరాలు.**

1,100 మందికిపైగా శిబిరాన్ని సందర్శించారు, 710 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు, 440 మందికిపైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు, 30 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు, రెండవ రోజు కొనసాగిన కంటి శుక్లాల ఆపరేషన్లలో మరో 34 మంది పేషెంట్లకు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేశామని ఐక్యత ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో.. సర్పంచ్ లు కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు విజయ్ కుమార్,రఘు, యాదయ్య ,మల్లేష్,శ్రీపతి, శేఖర్,శివ కాకి, భాస్కర్, సాయి కిరణ్, శంకర నేత్రాలయ వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా అమనగలు మున్సిపాల్టీ లోని 2వార్డ్ మూర్తుజపల్లి ముచర్ల మల్లేష్. కానుగుల పార్వతమ్మ. ఇళ్ల ఫిన్సింగ్ కు బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ .తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫినిషింగ్ కొరకు సిమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ 2 వార్డ్ కౌన్సిలర్ కాలే యశోదమ్మ. కాలే విక్రమ్. వరికుప్పల బాబు. గండికోట వీరేష్. తదితరులు పాల్గొన్నారు

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత వైఎస్సార్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డా.వైఎస్సార్ 77వ జయంతి సందర్భంగా పంజాగుట్ట సిటీ సెంటర్‌లోని డా.వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ...మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పేదల సంక్షేమాన్ని పాలనలో ప్రధాన లక్ష్యంగా మార్చిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్ర ప్రజానేతగా నిలబెట్టిందన్నారు. సామాన్యులతో మమేకమై వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ విధానాలను రూపొందించిన నాయకుడిగా వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక భద్రతా పెన్షన్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, మహిళలకు పావలా వడ్డీ రుణాలు వంటి పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు భరోసా కల్పించాయన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రైతుల ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేయడం వైఎస్సార్ రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. రైతు, పేద, బలహీన వర్గాల సంక్షేమమే ఆయన పాలనకు కేంద్రబిందువన్నారు.

డాక్టర్ వైఎస్సార్ జీవితం, ప్రజాసేవా దృక్పథం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## ఆ మాత్రం తేడా తెలియకపోతే ఎలా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి కొండాసురేఖ వర్సెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు అధికార కాంగ్రెస్ పార్టీలో మరోసారి భగ్గుమన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖలో అధికారిక సమీక్ష నిర్వహించారని...మంత్రి కొండా సురేఖ ఆరోపించడం సంచలనంగా మారింది. కడియం శ్రీహరి 'రూల్స్ ఆఫ్ బిజినెస్' ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ...నేరుగా C.M రేవంత్ రెడ్డికి లేఖ రాయడంతో పాటు ఏఐసీసీ పెద్దలకు సైతం ఫిర్యాదు చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఫిర్యాదుపై కడియం శ్రీహరి స్పందించారు. ప్రజల మధ్య లేనివాళ్లు.. కాంట్రవర్సీలతో లైమ్‌లైట్‌లో ఉండేందుకు ప్రయత్నం చేస్తుంటారని, తమశాఖ అధికారులకు తమకు తెలియకుండా కలవడమేంటి అని ప్రశ్నించడం అవివేకం అన్నారు.

**ఎవరికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు:**

మంత్రి తనను తప్పుగా అర్థం చేసుకున్నారని తాను ఎలాంటి తప్పు చేయలేదని ఈ విషయంలో వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒక ప్రజాప్రతినిధిగా ఏ అధికారినైనా కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చే హక్కు తనకు ఉందన్నారు. అదే కోవలా తాను తన నియోజకవర్గానికి సంబంధించిన దేవాలయాల అభివృద్ధి గురించి తాను సంబంధింత శాఖ అధికారుల వద్దకు వెళ్లానన్నారు. అధికారులను తన వద్దకు పిలిపించుకోలేదని తానే అధికారుల వద్దకు వెళ్లాలని చెప్పారు. అభివృద్ధిని పట్టించుకోని వారే వివాదాలు సృష్టిస్తున్నారని, తాము సమీక్షలు చేయలేదని, కేవలం ఆలయాల అభివృద్ధి కోసమే దేవాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లానని స్పష్టం చేశారు. సమీక్షకు, సమస్యలపై వినతి పత్రం ఇవ్వడానికి చాలా తేడా ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం సమీక్ష కేవలం మంత్రులు, కేబినెట్ ర్యాంక్ ఉన్న వారు మాత్రమే చేయగలరు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సమీక్షలో పాల్గొంటారన్నారు. నా పనులు నేను చేసుకుంటూ వెళ్తుంటే ఇలా మాట్లాడం బాధేస్తుందన్నారు. ఇది మంచి పరిణామం కాదన్నారు. నేను ఎక్కడ తప్పు చేయలేదని నేను ఎవరికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మాకు తెలియకుండా మా శాఖ అధికారుల వద్దకు వెళ్లొద్దనడం నేను ఎక్కడా వినలేదన్నారు.

# రేవంత్, ఉత్తమ్‌ని ఉరితీసినా తప్పు లేదు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో తెలంగాణలో చెరువులు నింపేందుకు అవకాశం ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవాళ నగరంలోని తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో వర్షాలు లేక దాదాపు 90 శాతం చెరువులు ఎండిపోయాయని హరీశ్ రావు అన్నారు. అయినా మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దుర్మార్గంగా దిగువకు వదులుతున్నారని కామెంట్ చేశారు. పొరుగున ఉన్న చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్ రెడ్డి నీళ్లను యథేచ్ఛగా వదులుతున్నారని సెటైర్లు వేశారు. నదులలో నీళ్లు ఉండి కూడా.. మోటార్లతో లిఫ్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకు వస్తుందని.. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఉరి తీసినా తప్పులేదని హరీశ్ రావు ధ్వజమెత్తారు. నీళ్ల మంత్రిగా ఉత్తమ్, ముఖ్యమంత్రిగా రేవంత్ ఇద్దరూ ఫెయిల్ అయ్యారంటూ కామెంట్ చేశారు.

**రేవంత్.. అబద్ధాల్లో 'నోబెల్ ప్రైజ్' నీకే!**

సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయని, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయని హరీశ్ రావు తెలిపారు. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడం లేదని.. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటర్లు అసలు ఆన్ చేయలేదని పేర్కొన్నారు. కట్టిన ఇళ్లు.. పెట్టిన పొయ్యి లాగా కేసీఆర్ అన్న చేశారని.. అయినా చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయట్లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అబద్ధాలు చెప్పే విషయంలో రేవంత్ రెడ్డికి నోబెల్ ప్రైజ్ వస్తుందని సెటైర్లు వేశారు. సీఎం నిన్న చెప్పిన ప్రతి ఒక్క అబద్ధానికి.. ఒక్కొక్క అక్షరానికి సమాధానం చెబుతానని అన్నారు. అయినా, కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ఈ ప్రభుత్వం నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉందన్నారు. మేడిగడ్డ విషయంలో కుంటిసాకులు చెబుతన్నారని.. దేవాదుల నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని హరీశ్ అన్నారు. తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు మహారాష్ట్ర ఒప్పుకున్నట్లుగా డాక్యుమెంట్ ఉంటే రేవంత్ రెడ్డి బయటపెట్టాలని.. అలా చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. లేనిపక్షంలో ప్రజల ముందుకు వచ్చి ఇదే రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు సవాల్ విసిరారు.

# వారం రోజుల్లో సమాధానం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్ విషయంలో ఈసీ ఇచ్చిన నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇస్తానని ఢిల్లీ హైకోర్టుకు ఆ పార్టీ తరఫు అడ్వకేట్ తెలిపారు. ఎలక్షన్ కమిషన్ సూచన మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుపై అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని.. రెండు పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను మాత్రమే తమకు ఈసీ పంపగా వాటికి సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఇవాళ జరిగిన విచారణ సందర్భంగా వాదనలు వినిపించిన టీఆర్ఎస్ అడ్వకేట్.. పార్టీ పేరుపై అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో మరో మూడు పేర్లను సూచించాలని తమకు ఈసీ నోటీసులు ఇచ్చారని వివరించారు. అయితే తమ పార్టీ పేరుపై వచ్చిన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకునే హక్కు తమకు ఉందని.. ఆ అభ్యంతరాలన్నీ తమకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

**ముందు సమాధానం ఇవ్వండి:**

దీనిపై స్పందించిన న్యాయమూర్తి ముందుగా ఈసీ ఇచ్చిన నోటీసులకు సమాధానం చెప్పాలని ఆదేశించారు. దీంతో వారం రోజుల్లో ఈసీకి సమాధానం ఇస్తామని టీఆర్ఎస్ అడ్వకేట్ కోర్టుకు తెలిపారు. పార్టీ పేరుపై నిర్ణయం తీసుకునే ముందు తాము ఈసీ హియరింగ్ నిర్వహించి తమ వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని టీఆర్ఎస్ కోరగా ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈసీ నోటీసులకు తెలంగాణ రక్షణ సేన పార్టీ బదులిచ్చిన తర్వాత వారి వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని ఈసీని ఆదేశించారు.

**అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు?:**

హైకోర్టు ఆదేశాలపై టీఆర్ఎస్ వర్గాలు స్పందించాయి. తెలంగాణ ప్రజా జాగృతి పేరుతో తాము పార్టీ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని.. కేంద్ర ఎన్నికల సంఘమే తమ అప్లికేషన్‌లో ఉన్న మూడో పేరు తెలంగాణ రక్షణ సేన కేటాయిస్తూ అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఇచ్చిందని పార్టీ వర్గాలు గుర్తు చేశాయి. తమ పార్టీ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని చెప్తున్నారు తప్ప అవి ఏమిటో తమకు ఇవ్వడం లేదన్నారు. ఈసీ ఇచ్చిన అనుమతితోనే తాము తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండా గద్దెలు నిర్మించుకొని పార్టీ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈసీ నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇస్తామని.. ఆ తర్వాత తమ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఈసీ ఎదుట వ్యక్తిగతంగా హాజరై పార్టీ పేరుపై వివరణ ఇస్తారని తెలిపారు. ఇప్పటికే తెలంగాణలో టీఆర్ఎస్ అబ్రివేషన్ వచ్చేలా రెండు రాజకీయ పార్టీలకు ఈసీ గుర్తింపును ఇచ్చింది. అందులో ఒకపార్టీ 2023లో, మరో పార్టీ 2024లో రిజిస్ట్రేషన్ అయ్యాయి. 2026లో తాము తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఈసీ ఆదేశాల మేరకు పత్రిక ప్రకటనలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతుంటే అభ్యంతరాలు చెబుతున్నారు. గతంలో లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అతిమంగా గెలిచేది న్యాయమే అని ఈ పోరాటంలో తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# డైవర్షన్ కే కాళేశ్వరం డ్రామా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ధరణిలో అక్రమాలు నిజమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ధరణితో పాటు భూభారతిలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ధరణితో పాటు భూభారతిపైనా సిట్ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇవాళ బీజేపీ స్టేట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ధరణి, భూభారతి అవకతవకలు బయటపడుతున్నాయనే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కన్నెపల్లి అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇది కాళేశ్వరం, కూలేశ్వరం కాదు ఈ రెండు పార్టీలు కలిసి చేస్తున్న డ్రామేశ్వరం అని ఎద్దేవా చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసమే కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారన్నారు. ఎన్డీఎస్ఏ రిపోర్టే బీజేపీ విధానం అన్నారు. ఇకనైనా రాజకీయాలు పక్కన పెట్టి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు.

**బీజేపీ కృషితోనే తాటిచర్ల-2 గని:**

కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే తాటిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందని చెప్పారు.



సింగరేణి విషయంలో ఎప్పుడైనా బీజేపీ ప్రభుత్వాలే కాపాడాయి తప్ప కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏమి చేయలేదన్నారు. ఈ బ్లాక్ ద్వారా సంస్థకు రూ.64 వేల కోట్ల ఆదాయంతో పాటు 1200 అదనపు ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. తాటిచర్ల-2 తమ ప్రయత్నం చెప్పుకుంటున్న కాంగ్రెస్ చెప్పుకుంటోందని ఇదే నిజం అయితే మన్ మోహన్ సింగ్ హాయంలో ఎందుకు రాలేదన్నారు. ఈ గని రావడం వెనుక కేంద్రప్రభుత్వం, కిషన్ రెడ్డి కృషి ఉందన్నారు. తాటిచర్ల గనిని కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండాలి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండలంలోని అలగడప,అవంతిపురం గ్రామాలలో మరియు పట్టణంలోని 4వ వార్డ్ ఈదులగూడ లలో బూత్‌లలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని బుధవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యక్షంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి బూత్‌లో నమోదవుతున్న దరఖాస్తులు,ఓటరు వివరాల సవరణ ప్రక్రియ,అర్హులైన ఓటర్ల నమోదు,అవసంమైన ధ్రువపత్రాల పరిశీలన,ప్రజలకు అందుతున్న సేవలపై ఎమ్మెల్యే సమగ్రంగా ఆరా తీశారు. కార్యక్రమం పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా మరియు నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం బూత్ లెవల్ అధికారులతో (బిఎల్వో) మాట్లాడిన ఎమ్మెల్యే,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన



అవగాహన కల్పిస్తూ,ఎవరూ ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎ)కూడా పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ,ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని,ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు,బిఎల్వోలు,బిఎల్ఎలు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, బిఎల్వోలు,బిఎల్ఎలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐదుగురు నాన్ ఎస్‌సీఎస్ అధికారులకు ఐఏఎస్‌గా పదోన్నతి




**ఆంధ్రప్రదేశ్ :** రాష్ట్రానికి చెందిన ఐదుగురు నాన్-స్టేట్ సివిల్ సర్వీస్ అధికారులకు ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, వ్యవహారాలు, పెన్షన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఖాళీల ఆధారంగా కేంద్ర సెలెక్షన్ కమిటీ ఈ ఐదుగురు అధికారులను ఎంపిక చేసింది. అంతేకాదు వారిని ఏపీ క్యాడర్‌కే కేటాయించింది. ప్రభల గోపీనాథ్‌తో పాటు గుడిసా బాలకృష్ణ, ఎం. జయకృష్ణ, ఏ.ఏ.ఎల్. పద్మావతి, డాక్టర్ ఎం. వరప్రసాద్ పదోన్నతి పొందారు. విభిన్న శాఖల్లో నాన్-ఎస్‌సీఎస్ కేటగిరీలో సేవలు అందించారు. సీనియారిటీ ఆధారంగా సివిల్ సర్వీసెస్‌లో వీరికి భాగస్వామ్యం కల్పించింది. తదుపరి చర్యలను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఐఏఎస్‌లుగా ఎంపికైన ఈ ఐదుగురు అధికారుల సీనియారిటీ నిర్ధారణ, తుది కేడర్ కేటాయింపు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌కి పంపిన ఉత్తర్వుల్లో కేంద్రం సూచించింది.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు**

సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్ (USA): బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేశ్ కొందూరు (USA): అమెరికా ప్రభుత్వ సలహాదారు మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా (UK): ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ, దిలెక్ , నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ, థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు, సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ (CWC) అధ్యక్షుడు( శ్రీలంక) సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

**తెలంగాణలో రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ అగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ అగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## ఎస్ఐఆర్ డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలి

**నిర్మల్,ఫ్లాష్ ఇండియా :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారాల డిజిటలీకరణను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఓటర్లు నింపి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారాల డిజిటలీకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీఎల్ఓలు డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇంటికి వెళ్లి, నింపిన ఫారాలను తిరిగి తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. సూపర్‌వైజర్లు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారాలు నింపుతున్న తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసీల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం..

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైన హక్కు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఈ హక్కు ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎన్నికల పారదర్శకత, ప్రజాస్వామ్య బలపాటు, ప్రభుత్వాల చట్టబద్ధత అన్నీ కూడా సరైన ఓటరు జాబితాపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దిష్ట వ్యవధిలో సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) చేపడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరును జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాలను నవీకరించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది. కానీ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మాత్రం అనేక లోపాలు, నిర్లక్ష్యం, సమన్వయ లోపాలకు నిదర్శనంగా మారుతోంది. అధికారుల గణాంకాలు ఒక విధంగా ఉంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉండటం ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో అనుమానాలు పెంచుతోంది.ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమై దాదాపు రెండు వారాలు గడిచినా ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాలేదు. అయితే ఎన్నికల సంఘం మాత్రం రాష్ట్రవ్యాప్తంగా 96 శాతం ఫారాలను పంపిణీ చేసినట్లు అధికారికంగా ప్రకటిస్తోంది. ఈ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో దాదాపు పని పూర్తయినట్లే కనిపిస్తుంది. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్--మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి వంటి జిల్లాల్లో లక్షలాది మంది ఓటర్లు తమకు ఇప్పటికీ ఫారాలు అందలేదని చెబుతున్నారు. అనేక కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గ్రామాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ రాలేదని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. దీంతో అధికారిక లెక్కల విశ్వసనీయతపై సహజంగానే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బూత్ లెవల్ ఆఫీసర్లు ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పాత్ర పోషిస్తారు. ఓటర్లకు నేరుగా చేరువయ్యే ప్రభుత్వ యంత్రాంగం వారే. ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలు అందించడం, వాటిని ఎలా నింపాలో వివరించడం, అవసరమైతే సహాయం చేయడం, అనంతరం వాటిని తిరిగి సేకరించడం వారి ప్రధాన బాధ్యత. కానీ అనేక ప్రాంతాల్లో ఈ విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు బీఎల్‌వోలకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, మరికొందరు ప్రజలే వచ్చి ఫారాలు తీసుకెళ్లాలని చెబుతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఇంటింటికీ వెళ్లాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, చాలామంది ఒకేచోట కూర్చొని ఫారాలు పంపిణీ చేయడం లేదా పంపిణీ చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేయడం వంటి ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.మరోవైపు జిల్లాల వారీగా విడుదల చేసిన గణాంకాలు కూడా అనుమానాలకు తావిస్తున్నాయి. నిర్మల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వంద శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. వనపర్తి, నాగర్‌కర్నూలు, కామారెడ్డి, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల్లో కూడా దాదాపు 99 శాతం పంపిణీ జరిగిందని పేర్కొంటున్నారు. ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది స్వతంత్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు అధికారుల నివేదికలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఒకవేళ నిజంగానే ఫారాలు అందకపోతే, పంపిణీ పూర్తయిందని ఎలా నమోదు చేశారు? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.ఎన్నికల ప్రక్రియలో గణాంకాల కంటే విశ్వాసం చాలా ముఖ్యం. ఎన్నికల సంఘం ప్రకటించే ప్రతి సంఖ్య ప్రజలు నమ్మదగినదిగా ఉండాలి. ఒకవేళ క్షేత్రస్థాయి వాస్తవాలు వేరుగా ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికత, పారదర్శకత అత్యంత కీలకమైనవి. అందుకే ప్రతి ఫిర్యాదును తక్షణమే పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి.ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించాల్సి ఉండటం మరో సమస్యగా మారింది. ఇప్పటికీ అనేక మందికి ఫారాలే అందలేదు. మరి వారు గడువులోగా వాటిని ఎలా నింపి సమర్పిస్తారు? ఈ ప్రశ్నకు ఎన్నికల అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. గడువులు నిర్ణయించడం ఒక్కటే కాదు, ఆ గడువులు అమలయ్యే పరిస్థితులు కల్పించడం కూడా అధికారుల బాధ్యతే. అవసరమైతే గడువును పొడిగించడం, అదనపు సిబ్బందిని నియమించడం, ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే వేలాది మంది అర్హులైన ఓటర్లు ఈ ప్రక్రియకు దూరమయ్యే ప్రమాదం ఉంది.పట్టణ ప్రాంతాల్లో మరో సమస్య కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బీఎల్‌వోలుగా నియమించిన కొందరికి ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని విమర్శలు ఉన్నాయి. ఓటర్ల సందేహాలకు సరైన సమాధానాలు చెప్పలేకపోవడం, ఫారాల నింపడంలో సహకరించలేకపోవడం, అవసరమైన పత్రాలపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎన్నికల వంటి అత్యంత సున్నితమైన ప్రక్రియలో శిక్షణ లేని సిబ్బందిని వినియోగించడం సరైన విధానం కాదు. ప్రతి బీఎల్‌వోకు సమగ్ర శిక్షణ, స్పష్టమైన మార్గదర్శకాలు, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించడం తప్పనిసరి.ప్రజల్లో మాత్రం తమ ఓటు హక్కుపై మంచి చైతన్యం కనిపిస్తోంది. చాలామంది ఆన్‌లైన్‌లో సమాచారం తెలుసుకుని స్వయంగా ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. కొందరు బీఎల్‌వోలను వెతుక్కుని వెళ్లి ఫారాలు తీసుకుంటున్నారు. మరికొందరు అధికారుల కార్యాలయాలను సంప్రదిస్తున్నారు. ప్రజలు తమ హక్కును కాపాడుకోవడానికి ఇంత చొరవ చూపుతున్నప్పుడు, అదే స్థాయిలో ఎన్నికల యంత్రాంగం స్పందించకపోవడం విచారకరం. ప్రజల చైతన్యానికి అధికారుల బాధ్యత జతకావాలి. అప్పుడే ఎన్నికల ప్రక్రియపై నమ్మకం మరింత బలపడుతుంది.రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. అధికారిక గణాంకాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల నిర్వహణపై సందేహాలు వ్యక్తం చేసే హక్కు ఉంది. అయితే అలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందుగానే ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించడం అవసరం. ప్రతి జిల్లాలో రోజువారీ పురోగతిని ప్రజలకు అందుబాటులో ఉంచడం, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం, ఫీల్డ్ తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలు విశ్వాసాన్ని పెంచుతాయి.ఈ సందర్భంగా ఎన్నికల సంఘం సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉంది. ప్రతి బీఎల్‌వో ఎన్ని ఇళ్లను సందర్శించాడు, ఎన్ని ఫారాలు అందించాడు, ఎన్ని ఫారాలు తిరిగి స్వీకరించాడు అనే సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయాలి. జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ, మొబైల్ యాప్‌ల వినియోగం, ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థలను విస్తృతంగా అమలు చేస్తే తప్పుడు గణాంకాలకు అవకాశం తగ్గుతుంది. అదే సమయంలో ఓటర్లు తమ ఫారం స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే సౌకర్యం కూడా కల్పించాలి.ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. అందువల్ల దాని విశ్వసనీయత ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చిన్న నిర్లక్ష్యం కూడా భవిష్యత్తు ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అర్హులైన ఓటర్లు జాబితాలో లేకపోవడం, తప్పులు సరిదిద్దకపోవడం, ఫారాల పంపిణీలో లోపాలు ఉండడం వంటి అంశాలు ఎన్నికల అనంతరం వివాదాలకు దారితీయవచ్చు. అందువల్ల ఎన్నికల సంఘం గణాంకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలి.ఓటరు జాబితా అనేది కేవలం ఒక పరిపాలనా పత్రం కాదు. అది ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి అర్హుడి పేరు అందులో ఉండడం ఎన్నికల సంఘం బాధ్యత మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంపై ఉన్న నైతిక బాధ్యత కూడా. కాబట్టి సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఫారాలు అందని ప్రతి ఇంటికి చేరుకోవాలి. బీఎల్‌వోల పనితీరును కఠినంగా సమీక్షించాలి. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. అవసరమైతే గడువును పునఃపరిశీలించి ఒక్క అర్హుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై ప్రజల విశ్వాసమే అత్యంత విలువైన సంపద. ఆ విశ్వాసాన్ని కాపాడుకోవడం ఎన్నికల సంఘం, ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయి అధికారులందరి ఉమ్మడి బాధ్యత. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ.

# సంక్షోభం అంచున సింగరేణి!

తెలంగాణ సిరుల గని సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. లక్షలాది కుటుంబాలకు బతుకుదెరువుగా, విద్యుత్ ఉత్పత్తికి, పారిశ్రామికాభివృద్ధికి చోదకశక్తిగా నిలిచిన నల్ల బంగారు గని. అయితే, ఎంతో ప్రాశస్త్యం కలిగిన సింగరేణి కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలకు నిలయంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. బీఆర్ఎస్ పాలనలో ఉత్పత్తికి, కార్మిక సంక్షేమానికి పట్టుగొమ్మగా నిలిచిన సింగరేణి లాభాల బాటలో పయనించింది. దేశానికే ఆదర్శంగా నిలిచింది. కానీ, నేడు కాంగ్రెస్ కుంభకోణాల ఊబిలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నది. కన్నతల్లే వివక్ష చూపినట్లు 51శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం యధేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తుంటే, 49శాతం వాటా ఉన్న కేంద్రం జరుగుతున్న అక్రమాలను అడ్డుకోకపోగా, దృతరాష్ట్రుని వలె కళ్లు మూసుకొని వ్యవహరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరికొకరు తోడై సింగరేణి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టులు అస్మదీయులకు కట్టబెట్టడం కోసం నిబంధనలను అడ్డగోలుగా మార్చారు. సింగరేణి చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే నిబంధన ప్రవేశ పెట్టారు. ఓబీ కాంట్రాక్టును ఆశించే కంపెనీ సైట్ విజిట్ చేయాలి. చేసినట్లు సింగరేణి నుంచి సర్టిఫికెట్ పొందాలి. అప్పుడే టెండర్ వేయడానికి అర్హత వస్తుంది. ఈ సర్టిఫికెట్ జారీని అడ్డుపెట్టుకొని పోటీని పరిమితం చేశారు. ఎవరికి సర్టిఫికెట్ ఇవ్వాలి, ఎవరికి ఇవ్వొద్దు అనేది అంతా పాలకుల ఇష్టమే. ఈ అవకాశాన్ని అడ్డంపెట్టుకొని ముఖ్యమంత్రి ఏకంగా తన బామ్మర్దికి చెందిన శోధా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి కాంట్రాక్టులు కట్టబెట్టిండు. వెంకటేశ్ ఖనిలో ప్లస్ 13 శాతానికి టెండర్ దక్కేలా చేసిండు. 2024 మే తర్వాత వచ్చిన ఓబీ టెండర్ల కాంట్రాక్టులన్నీ వారి నిర్ణయాల మేరకే జరిగి, వారి అనుయాయులకే దక్కాయి. శ్రీరాంపూర్ ఓసీ-2 విషయంలో వాటాల పంపకాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో టెండర్‌ను ఏడుసార్లు వాయిదా వేశారు. ఈ అవినీతి, అక్రమాలను బీఆర్ఎస్ నిలదీయడంతో, ప్లస్ 12 శాతంగా ఉన్న టెండర్‌ను మైనస్ 12 శాతానికి ఖరారు చేశారు. బీఆర్ఎస్ పుణ్యమా అని సింగరేణి సొమ్ము అవినీతిపాలు కాకుండా కొంత ఆదా అయింది. ఈ కుంభకోణాలను ఒక్కొక్కటిగా బీఆర్ఎస్ బయటపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయిన కాంగ్రెస్ తప్పించుకోవడం కోసం కంటి తుడుపుగా ఒక్క నైనీ బ్లాక్ టెండర్‌ను రద్దు చేసింది.

### సోలార్ పవర్‌లోనూ స్కాం

సోలార్ పవర్ ప్లాంట్ల టెండర్లలోనూ ఇదే 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనను ఉపయోగించి సింగరేణి నిధులను స్వాహా చేశారు. 107 మెగావాట్లు, 67 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో పక్షపాతంగా వ్యవహరించి ముందే నిర్ణయించిన కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారు. నిబంధనలు సాకుగా చూపించి చిన్న, మధ్య తరహా సంస్థలు టెండర్లలో పాల్గొనకుండా చేశారు. ఒక మెగావాట్‌కు ధర రూ.3 కోట్లుగా ఉంటే, తమ అవినీతి ప్రయోజనాల కోసం రూ.7 కోట్లకు పెంచి కేటాయించడంతో 67 మెగావాట్ల ప్రాజెక్టులోనే సుమారు రూ.250 కోట్ల అదనపు భారం సింగరేణిపై పడింది. అదేవిధంగా 107 మెగావాట్ల ప్లాంట్‌ను మెగావాట్‌కు రూ.5.4 కోట్ల చొప్పున మొత్తం రూ.540 కోట్లకు కట్టబెట్టారు. రూ. 480 కోట్లతో నిర్మించిన 67 మెగావాట్ల ప్లాంట్ రెండేళ్లు గడిచినా ఇప్పటికీ సింక్రనైజేషన్, పీపీఏ లేకుండా నిరుపయోగంగా ఉంది. అలాగే 580 కోట్లతో చేపట్టిన 107 మెగావాట్ల ప్లాంట్ కూడా పీపీఏ లేక, సింక్రనైజేషన్ పూర్తికాక మూలనపడింది. సోలార్ పవర్ కొనుగోలు చేయబోమని విద్యుత్ సంస్థలు ఇప్పటికే సర్క్యులర్ ఇచ్చినా కమీషన్ల కోసమే ఈ వ్యవహారం నడిపారు. సుమారు రూ.1000 కోట్ల సింగరేణి సొమ్మును వృథా చేశారు.

### పీపీఏ, డీపీఆర్ లేకుండా ప్రాజెక్టులు

మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు టెండర్లు పిలిచి, ముందే నిర్ణయించిన కంపెనీలకు వేలకోట్ల రూపాయలకు కాంట్రాక్టులు కట్టబెట్టారు. రాజస్తాన్‌తో కలిసి జాయింట్ వెంచర్‌గా చేపట్టాలనే ప్రతిపాదనకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. ఈ ప్రాజెక్టుకు పీపీఏ, డీపీఆర్ లేకపోవడంతో అప్పులు పుట్టక ప్రాజెక్టు మూలనపడింది. ఇప్పటికే సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేశారు. ప్రాజెక్ట్ ఆలస్యం కారణంగా సింగరేణికి రోజుకు రెండు కోట్ల చొప్పున ఏడాదికి రూ. 750 కోట్లు నష్టం. ఎంత విచిత్రం అంటే.. రాజస్థాన్ ప్రభుత్వంతో 76:24 నిష్పత్తిలో ఒప్పందం చేసుకోగా, తమ 24 శాతం వాటా కింద పాకిస్థాన్ సరిహద్దులోని జైసల్మేర్ వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి కేటాయించారు. అతి తక్కువ ధరకే ఎన్‌టీపీసీ నుంచి విద్యుత్ అందుబాటులో ఉండగా సోలార్ పవర్ ఎందుకు? బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి సంస్థ ఎక్కడో జైసల్మేర్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి? రాజస్థాన్‌లోని జైపూర్‌లో కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించడం ఎందుకు? ఇది సింగరేణి నిధుల వృథా కాదా? ఈ తతంగం అంతా కమీషన్లు దండుకోవడం కోసం కాదా?

### బొగ్గునే మాయం చేసిన ఘనులు

బొగ్గు నిల్వల విషయంలో ప్రభుత్వం చేస్తున్న గోల్‌మాల్ చూస్తే నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్లుంది. సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఎలా మాయం అయ్యాయని బీఆర్ఎస్ నిలదీస్తే అది కప్పిపుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లో 26 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. రోజుకు 40వేల మెట్రిక్ టన్నుల చొప్పున స్టాక్ తగ్గిస్తూ గోల్‌మాల్ చేశారు. సుమారు రూ.1600 కోట్ల బొగ్గు ఎక్కడా అంటే సమాధానం లేదు. బొగ్గు నిల్వలు చూడడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను వందల మంది పోలీసులను పెట్టి అడ్డుకున్నారు. లేని నిల్వలు చూపేందుకు రామగుండం, భూపాలపల్లి సహా ఇతర గనుల్లో సమీప ఏరియాల నుంచి బొగ్గును లారీలల్లో తెచ్చి పోస్తున్నరు. ఎంతదారుణం అంటే అడ్రియాలా లాంగ్‌వాల్ గనిలో ఏడాదిన్నరగా ఉత్పత్తి నిలిచిపోతే అక్కడా లక్షా 80వేల టన్నులు బొగ్గు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. ఇంత దారుణంగా వంచించడం వెనుక ఉన్న అసలు వాస్తవం ఏమిటి?

### కుంభకోణాల మయం

ఎక్స్‌ప్లోజివ్స్ కొనుగోళ్లలో మార్కెట్ ధరల కంటే అధిక ధరలకు కొనుగోళ్లు చేసి ఒక్క ఆర్డర్‌లోనే సుమారు రూ.300 కోట్ల నష్టం కలిగించారు. అభ్యంతరం చెప్పిన అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి బదిలీలు, రాజీనామాలు చేయించారు. డీజిల్ కొనుగోళ్ల విధానాన్ని మార్చి ప్రైవేటు కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చారు. దీనివల్ల ప్రతి ఏడాది వందల కోట్ల అదనపు భారం పడుతోంది. సింగరేణి లాభాలను తప్పుగా చూపించి వేల కోట్ల నిధులు పక్కదారి పట్టించారు. కార్మికులకు ఇచ్చే లాభాల బోనస్‌లోనూ కోత విధించారు. బొగ్గు కొనుగోళ్ల బాకీ చెల్లించకుండా రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం సంస్థకు 12,377 కోట్లు బకాయి పడింది. రాష్ట్ర ప్రభుత్వ ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) పరిమితి రూ. 3200 కోట్లు ఉంటే, సింగరేణి ఏకంగా రూ. 4300 కోట్ల ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్ళింది. చివరకు కార్మికులకు జీతాలు ఇవ్వాలంటే బ్యాంకుల వద్ద అప్పులు తీసుకోవాల్సిన దుస్థితికి సంస్థను నెట్టారు. సింగరేణి భవిష్యత్తు ప్రణాళిక అంటూ లాభాల్లో చూపకుండా గతేడాది రూ.2283 కోట్లు, ఈ ఏడాది రూ. 4034 కోట్లు పక్కన బెట్టారు. మరి సింగరేణి రూ.6317 కోట్ల లాభాల్లో ఉంటే రూ.4300 కోట్ల ఓడీ ఎందుకు? బ్యాంకు నుంచి అప్పులు ఎందుకు? తలా తోక లేని నిర్ణయాలు, అవినీతి కుంభకోణాల వల్ల సింగరేణిలో ఉత్పత్తి తగ్గిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 2023లో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగగా, 2025--26 నాటికి 58 మిలియన్ టన్నులకు పడిపోయింది.

### బోగస్‌గా ఎన్నికల మేనిఫెస్టో

కేసీఆర్ కారుణ్య నియామకాలను పునరుద్ధరించారు. వారం వారం మెడికల్ బోర్డులు నిర్వహించారు. 16,813 వేల కారుణ్య నియామకాలు పూర్తిచేసి, యువ కార్మికులతో సింగరేణిని కళకళలాడేలా చేశారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో కారుణ్య నియామకాలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించింది. డిపెండెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియను నిరవధికంగా నిలిపివేసింది. కార్మిక సోదరుల ఆశలపై కుండెడు నీళ్లు చల్లింది. కేసీఆర్ సింగరేణిని లాభాల బాటలో నడిపించడమే కాకుండా, ఆ లాభాల్లో కార్మికులకు గతం కంటే ఎక్కువ వాటా దక్కేలా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంస్థ సంక్షోభం పాలైంది. సంస్థ సొమ్ము అవినీతిపరుల పాలైంది. సంక్షోభంలోపడి తండ్లాడుతున్నది.

### సింగరేణి కోసం మరో పోరాటం

సీఎం బంధువుల అవినీతి బాగోతాలపై నిష్పాక్షిక విచారణ జరిపించి, దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలి. 49 శాతం వాటా ఉన్న కేంద్రం ప్రేక్షక పాత్రకు పరిమితం కాకుండా, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం జోక్యం చేసుకోవాలి. ముఖ్యమంత్రి అండదండలతో జరుగుతున్న అక్రమాలపై కేంద్ర పరిశోధన సంస్థల ద్వారా దర్యాప్తు జరిపించాలి. దోపిడీ సొమ్ము కక్కించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడు దొంగలుగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ బొగ్గు గుట్టల్లో మరో ఉద్యమ అగ్గి పుట్టిస్తుంది. 'కాంగ్రెస్ హటావో -- సింగరేణి బచావో' నినాదంతో కార్మికులతో భుజం కలిసి కాంగ్రెస్ అవినీతికి చరమగీతం పాడుతుంది. సిరుల గనిగా సింగరేణికి ఉన్న ప్రతిష్టను తిరిగి నిలబెడుతుంది.

# బీఆర్ఎస్ కు మల్లారెడ్డి దూరమైనట్టేనా..?

మాజీ మంత్రి మల్లారెడ్డి బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా? ఆ విషయాన్ని ఆయన చెప్పకనే చెప్పేశారా? ఎప్పట్నుంచో జరుగుతున్న ప్రచారానికి తాజాగా బయటికి వచ్చిన ఓ వీడియో క్లారిటీ ఇచ్చేసిందా? ఏంటా వీడియో? అందులో ఏం చెప్పారు మల్లారెడ్డి? దాని గురించి ఇప్పుడు గులాబీ పార్టీలో జరుగుతున్న చర్చ ఏంటి? తెలంగాణ రాజకీయాల్లో తనదైన డిఫరెంట్ స్టైల్‌తో తరచూ వార్తల్లో నిలిచే మాజీ మంత్రి మల్లారెడ్డి... తాజాగా మరోసారి హాట్ టాపిక్ అయ్యారు. అది కూడా.... తన వ్యాఖ్యలతోనే. ఆ మాటలు విన్న చాలా మందికి ఆయన ఇక కారు దిగేసినట్టేనా? బీఆర్ఎస్‌కు బైబై చెప్పేసినట్టేనా అన్న సందేహాలు వస్తున్నాయట. ఇంకొందరైతే... సందేహాల స్థాయి దాటిపోయి...ఆయన అంత క్లారిటీగా మాట్లాడేస్తుంటే.... ఎనీ డౌట్ అని కూడా గట్టిగా అంటున్నారట. ఇంతకీ విషయం ఏంటంటే... తాజాగా ఓ సన్నిహితుడితో బర్త్‌డే కేక్ కట్ చేయించిన మల్లారెడ్డి.... కావాలని అన్నారో, కాకతాళీయంగా అన్నారోగాని ఆ మాటల చుట్టూనే కొత్త చర్చలు మొదలయ్యాయి. ఆయన ఏమన్నారో ఒక్కసారి వినండి. బీఆర్ఎస్‌కు దూరమయ్యానని నన్ను మర్చిపోతున్నారంటూ సన్నిహితుడితో అన్న మాటలు సరికొత్త చర్చకు దారితీశాయి. అంటే... మల్లన్న మానసికంగా ఇప్పటికే గులాబీ తోటకు దూరమయ్యారా అంటూ మాట్లాడేసుకుంటున్నాయి రాజకీయవర్గాలు. అది నిజమేనా అన్నట్టు కొన్ని రోజులుగా పార్టీ అధిష్ఠానానికి, ముఖ్యంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్న కీలక సమావేశాలకు దూరంగా ఉంటున్నారు మల్లారెడ్డి. అలాగే పార్టీ నిరసన కార్యక్రమాలతో సైతం టచ్ మీ నాట్ అంటున్నారాయన. ఇక తాజాగా అనుచరుడి బర్త్‌డే సందర్భంగా అన్న మాటలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవడంతో పాటు గులాబీ శ్రేణుల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అసలు మాజీ మంత్రి ఎందుకు ఇలా మాట్లాడుతున్నారంటూ పార్టీలో కూడా చర్చ జరుగుతోంది. అదే సమయంలో ఆయన దూరం అవ్వాలనుకోవడానికి కారణాలను కూడా అన్వేషిస్తున్నారు కొందరు. ఈ క్రమంలోనే గత అసెంబ్లీ సమావేశాల తర్వాతి నుంచి మల్లారెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉన్నారని గుర్తు చేస్తున్నారు నాయకులు. అప్పుడు జరిగిన ఒక ఘటన కూడా ఇందుకు కారణమై ఉండొచ్చని అంటున్నారు. తన పెళ్లి 50 ఏళ్ల వేడుకను అత్యంత ఘనంగా చేసుకున్నారు మల్లారెడ్డి. అలాంటి కార్యక్రమానికి కేసీఆర్ రాలేదంటూ కాస్త నారాజ్ అయ్యారంటూ అప్పట్లో చర్చ జరిగింది. పార్టీలోని కొందరు నాయకుల కారణంగానే... తన ఫంక్షన్‌కు కేసీఆర్ రాలేదని అప్పట్లో సన్నిహితుల దగ్గర అన్నారట ఆయన. ఇక నాటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న మల్లన్న... ఈ మధ్యకాలంలో పార్టీ తీసుకున్న ఏ కార్యక్రమానికి అటెండ్ అవలేదు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమాలు , సభ్యత నమోదు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది బీఆర్ఎస్. కానీ.... తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ నియోజకవర్గంలో ఇంతవరకు ఒక్క ప్రోగ్రామ్‌కు కూడా అటెండ్ అవలేదు మల్లారెడ్డి. అలాగే...ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో దాదాపు అన్ని సమావేశాలకు హాజరవుతున్న కేటీఆర్... మేడ్చల్ వైపు చూడలేదు. అసలు ఈ నియోజకవర్గంలో మీటింగ్ జరుగుతుందా లేదా అన్నది కూడా పార్టీ నాయకులు ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఈ పరిణామాలు జరుగుతున్న టైంలోనే... తాజా వీడియో బయటికి రావడంతో... ఇక ఆయన బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా అన్న చర్చలు మొదలయ్యాయి.అయితే బీఆర్ఎస్‌లోని కొందరు నేతలు మాత్రం... మల్లారెడ్డికి వేరే ఆలోచనలు ఉన్నాయని, అందుకే ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనని చెప్పిన మాజీ మంత్రి తన కుటుంబ సభ్యుల్లో తాను సూచించిన వారికి టికెట్లు ఇవ్వాలని కండిషన్లు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో మీడియా చిట్ చాట్‌లో తన మనోగతాన్ని చెప్పారు కూడా. వచ్చే ఎన్నికల్లో తన కుటుంబం నుంచి నలుగురైదుగురు పోటీలో ఉంటారని, అది ఏ పార్టీ నుంచి అయినా కావచ్చని అన్నారు. ఇలా చెప్పిన తర్వాతనే ప్రధాని నరేంద్ర మోడీని కలవడం ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అవడంలాంటివి జరిగాయి. ఆ రెండు సందర్భాల్లోగాని, వెళ్ళి వచ్చాకగాని మల్లారెడ్డి కనీస సమాచారం ఇవ్వలేదని బీఆర్ఎస్ పెద్దలు గుర్రుగా ఉన్నట్టు తెలంగాణ భవన్లో చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల పరిణామాలు జరుగుతున్న క్రమంలో... అసలు మల్లారెడ్డి మళ్లీ పార్టీకి దగ్గర అవుతారా? లేక తాను వీడియోలో అన్నట్టు నిజంగానే బీఆర్ఎస్‌కి దూరమవుతారా అన్నది తేలాలంటే ఇంకొన్నాళ్ళు వేచి చూడాలంటున్నారు పరిశీలకులు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# సమష్టి కృషే కీలకం

## సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమగ్ర అవగాహన కార్యక్రమం










**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు చట్టాన్ని అమలు సంస్థలు, విద్యాసంస్థలు, సమాజం, పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమగ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, సమష్టి కృషితోనే ఈ పోరాటంలో విజయం సాధించగలమని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ.. నిరంతర నిఘాతో పాటు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1908 ద్వారా ప్రజలు అందిస్తున్న సమాచారం రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించడానికి, వాటిని నిర్మూలించడానికి ఎంతగానో దోహదపడుతోందని శ్రీనివాసరావు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ యువతకు పెద్ద ముప్పుగా మారిందని, నిందితులు ముఖ్యంగా విద్యార్థులను, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు విద్యార్థులలో, ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.నషా ముక్త్ భారత్ అభియాన్ మూడు ముఖ్యమైన స్తంభాలపై ఆధారపడి పనిచేస్తుందని శ్రీనివాసరావు వివరించారు. డ్రగ్స్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, వ్యసనపరులకు విముక్తి కలిగించి పునరావాసం కల్పించడం ఇందులో ప్రధానమైనవని పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత భారత స్వప్నాన్ని సాకారం చేసేందుకు పౌరులంతా అప్రమత్తంగా ఉంటూ, డ్రగ్స్ వ్యతిరేక చర్యలకు చురుగ్గా మద్దతు ఇవ్వాలని కోరారు.అంతకుముందు పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కట్టుబడి ఉందని చెప్పారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఆరోగ్యకరమైన, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. అవగాహన, నివారణ, సరైన నిర్ణయాలు తీసుకోవడమే డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు అత్యంత ప్రభావవంతమైన మార్గాలని ఆమె పేర్కొన్నారు. వ్యసనంతో పోరాడుతున్న వారికి అండగా నిలిచి, వారు గౌరవప్రదంగా తిరిగి సమాజంలో కలిసిపోయేలా సహాయం చేయాల్సిన ప్రాధాన్యతను ఆమె గుర్తుచేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. ఆన్‌లైన్, సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ వ్యసనం నేడు యువతకు, కుటుంబాలకు, దేశ భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, బలమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, తోటివారిలో కూడా అవగాహన పెంచాలని ఆయన కోరారు.ఈ ప్రచారంలో అందరూ చురుగ్గా పాల్గొని, ఇక్కడ తెలుసుకున్న విషయాలను తమ కుటుంబాలకు, సమాజానికి చేరవేయాలని వక్తలు కోరారు. తద్వారా నషా ముక్త్ భారత్ నిర్మాణ సమష్టి కృషిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా, అధ్యాపకులు, విద్యార్థులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పుడు మంత్రివి, మేస్త్రీవి అన్నీ నువ్వే కదా?




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరంపై పొలిటికల్ గేమ్ నడుస్తుందని, తెలంగాణ రైతులపై ఏదో బీఆర్ఎస్ నేతలకే ఎక్కువ ప్రేమ ఉన్నట్టు, సీఎం రేవంత్ రెడ్డి ఏమీ చేయడం లేదన్నట్టు హరీష్ రావు రోజూ మాట్లాడుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. కాళేశ్వరం విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావుకు కౌంటర్ ఇచ్చారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు సిమెంట్, ఇసుక కలిపింది నువ్వే, ఇటుకలు పేర్చింది నువ్వే. ఇరిగేషన్ శాఖా మంత్రిగా అక్కడ రాత్రిపూట మంచం వేసుకుని పడుకున్నానని చెప్పుకున్నది నువ్వే. మీరు కట్టిన ప్రాజెక్టు మీ హయాంలోనే కూలిపోతే దానికి బాధ్యులు మీరా? లేక ఇప్పుడు అధికారంలోకి వచ్చిన మా కాంగ్రెస్ ప్రభుత్వమా?' అని ప్రశ్నించారు. నాడు రేవంత్ సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నారా లేక మంత్రిగా ఉత్తమ్ ఉన్నారా అని నిలదీశారు. పదే పదే కాంగ్రెస్‌ను బ్లేమ్ చేసే పని మానుకోవాలన్నారు.

**ముందు కేసీఆర్‌ను తీసుకుని రా..**

బీఆర్ఎస్ టార్గెట్ రేవంత్ రెడ్డి అని అసెంబ్లీ ఉన్నప్పుడు మాత్రం కేసీఆర్ రారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి అని సీఎం రేవంత్ అడుగుతున్నా ఎందుకు రావడం లేదని నిలదీశారు. హరీశ్ రావు మీ మామను తీసుకుని రా సీఎం అసెంబ్లీ సమావేశం పెడుతారని ఆ సమావేశానికి ఎన్‌డీఎస్‌ఏ ను కూడా పిలుద్దామని అందరి వాదనలు ప్రజలు వింటారన్నారు. సీఎం సవాల్ ను స్వీకరించి.. కేసీఆర్ ను తీసుకుని రావాలన్నారు. రేవంత్ రెడ్డి సాధయికి. .కి మేం చాలు అనే సినిమా డైలాగులు వద్దని అసలు నీ కెపాసిటీ ఏంటి? రేవంత్ రెడ్డి పర్సనాలిటీ కంటే నీ పర్సనాలిటీ పెద్దదా? అని నిలదీశారు. నేను మున్సిపల్ చైర్మన్ గా ఉన్నప్పుడు ...కాలేజీలో చదువుకుంటున్నావని గుర్తు చేశారు.

**దానికి సమాధానం చెప్పు:**

నిన్ను కేసీఆర్ ఇరిగేషన్ మంత్రిగా ఎందుకు తొలగించారో హరీశ్ రావు సమాధానం చెప్పాలన్నారు. నువ్వు కాళేశ్వరంలో తప్పులు చేశావ్ కాబట్టే కేసీఆర్ తప్పించారన్నారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ కాంగ్రెస్ ది కాదని అది కేంద్ర ప్రభుత్వ సంస్థ అన్నారు. అక్కడ నీళ్ళు నిలువ ఉంచవద్దని ఒక వేళ నీళ్లు నిల్వ చేస్తే భద్రాచలంకొట్టుకుపోతుంది అని హెచ్చరించిందన్నారు. ఖమ్మం కొట్టుకు పోయినా ఫరవాలేదా? హరీష్ అని ప్రశ్నించారు. ఖమ్మం ప్రజలు అక్కర లేదా? నీళ్లు ఆపడం వల్ల జరిగే ప్రమాదం కూడా ప్రజలు ఆలోచన చేయాలన్నారు. హరీశ్ రావు మంత్రిగా ఫెయిల్ అయ్యారని అందుకే కాళేశ్వరం కుంగింది..కూలిందన్నారు.

**అందుకే కూలింది..**

నువ్వు చేసిన కథకు... రేవంత్ రెడ్డి మీద పడితే ఏం లాభం? నీళ్లు స్టోరేజీ పెట్టొద్దు కానీ గత ప్రభుత్వం పెట్టిందని అందుకే కూలిందన్నారు. రేవంత్..ఇంకో ఐదేళ్లు సీఎం మేమే అంటున్నారు కాబట్టి ఆందోళనలో బీఆర్ఎస్ ఉందన్నారు. దొంగ మాటలు...దొంగ ముచ్చట్లు చెప్పడంలో కేసీఆర్ ఫ్యామిలీ ఎక్స్పర్ట్ అని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం చెప్పే మాటలు నమ్మవొద్దని దొంగ మాటలు....దొంగ రాజకీయాలు ఆపకపోతే ఊరుకోమని హెచ్చరించారు. హరీష్ రావు నోటి మాటలే కాబట్టి ఏదైనా చెప్తాడు కూలీ పోతే బాధ్యత ఆయనకు ఉంటుందా అని నిలదీశారు. నీళ్ళు ఇవ్వలేదని రేవంత్ ను ఉరి వేయాలని అడుగుతున్నారు. మరి డ్యామ్ కూలిపోవడానికి కారణం అయిన మిమ్మల్ని ఏం చేయాలని ప్రశ్నించారు.

# కొల్లాపూర్‌లో కలకలం..

**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా :** సభ్యసమాజం తలదించుకునే ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లోని ఓ కళాశాలలో వెలుగులోకి వచ్చింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన తండ్రి రూపంలో ఉన్న ప్రిన్సిపాలే కామపిశాచిగా మారి ఓ విద్యార్థిపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. అయితే, ఆ మృగాడి బారి నుంచి తప్పించుకునేందుకు సదరు విద్యార్థిని సాహసోపేతంగా పోరాడి, ప్రిన్సిపాల్ మర్మాంగాన్ని బలంగా కొరికి తప్పించుకుంది. బాధిత విద్యార్థి కథనం ప్రకారం.. అర్ధరాత్రి వేళ కొల్లాపూర్‌లోని ఓ కళాశాల ప్రిన్సిపాల్, సదరు విద్యార్థిపై అనుచితంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించాడు. ఊహించని ఈ ప్రమాదం నుంచి ఎలాగైనా బయటపడాలని భావించిన ఆ విద్యార్థి.. తనను లొంగదీసుకునేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్ మర్మాంగాన్ని గట్టిగా కొరికింది. దాంతో తీవ్ర నొప్పితో అతడు విలవిలలాడగా, ఆ గ్యాప్‌లో బాధిత విద్యార్థి అక్కడ నుంచి తప్పించుకుని ప్రాణాలను దక్కించుకుంది.

**సర్టిఫికెట్లు కాలేజీలో ఉండటంతో భయపడ్డా..**

అయితే, ఈ దారుణ ఘటనపై బాధిత విద్యార్థి ధైర్యంగా పోలీసులను ఆశ్రయించింది. సదరు ప్రిన్సిపాల్ తనపై ఇలా అనుచితంగా ప్రవర్తించడం ఇది రెండోసారి అని బాధితురాలు కన్నీరు పెట్టింది. తన ఒరిజినల్ సర్టిఫికెట్లు అన్నీ కాలేజీలోనే ఉండటంతో, ఎక్కడ తన ఫ్యూచర్ పాడు అవుతుందనే భయంతో గతంలో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేకపోయానని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.



# సూర్యాపేటలో కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ..

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ వివాదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఛలో గాంధీభవన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్తి నేతలు పిలుపునిచ్చారు. దీంతో వారిని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపుచేసేందుకు ఇరువర్గాలపై లాఠీఛార్జి చేశారు.సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల ప్రకటించిన తొమ్మిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను మార్చాలంటూ ఎమ్మెల్యే అసంతృప్తి వర్గం నేతలు ఈరోజు(బుధవారం) ఛలో గాంధీభవన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్వపల్లి చౌరస్తాకు వారి వాహనాలు చేరుకోగానే ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడులకు దిగారు. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దాడుల్లో రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి వారందరినీ చెదరగొట్టినప్పటికీ మరోసారి రాళ్లు, కర్రలతో దాడులు చేసుకుంటూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. చివరకు పోలీసులు లాఠీఛార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

# రైతుల కంటే రాజకీయమే ముఖ్యమా?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మేడిగడ్డ వద్ద వృథాగా లక్షల క్యూసెక్కులు పోతున్నాయని, నీళ్లు లేక రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. నీటిని వృథా చేస్తారా అని నిలదీశారు. నిర్లక్ష్యం వహించి.. కాంగ్రెస్ సర్కార్ తమాషా చూస్తున్నదని, అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించట్లేదా అని మండిపడ్డారు. గోదావరి జలాలను ఎత్తిపోసి.. రైతు గోస తీర్చాలనే సోయి లేదా? కేసీఆర్ మీద కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అన్నారు. మీ పగ ప్రతిపక్షం మీద తీర్చుకోండి అంతే కానీ రైతన్నలను ఆగం చేయవద్దన్నారు.

**కాళేశ్వరమే ప్రాణేశ్వరం:**

ఎల్ నినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? అని ప్రశ్నించారు. లోటు వర్షపాతంతో నాట్లు పడట్లేదని విత్తనాలు వేయట్లేదన్నారు. పంటలు సాగుచేసే పరిస్థితి లేని ప్రభుత్వమేమో ఏమీ పట్టించుకోకుండా దున్నపోతు మీద వానపడ్డట్టే వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారన్నారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా మీ పొలాలను ఎండబెతున్న కాంగ్రెస్ కర్కశ పాలన తీరును రైతులు ప్రశ్నించాలన్నారు. ఎక్కడా చుక్కనీళ్లు లేని కాలంలోనూ.. కాళేశ్వరమే ప్రాణేశ్వరమై కాపాడుతుందని అర్థం చేసుకోవాలన్నారు.

# మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం

**నాగర్ కర్నూల్ /తిమ్మాజిపేట/ బిజినపల్లి, ఫ్లాష్ ఇండియా :** ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట బస్టాండ్‌లో 11.5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోను పట్టణాలకు దీటుగా రహదారులు, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తిమ్మాజిపేట బస్టాండ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నందున సీసీ రోడ్డు నిర్మాణంతో దుమ్ము, బురద సమస్యలు తొలగిపోవడంతో పాటు ప్రయాణికులకు, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ఈ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ), నాగర్‌కర్నూల్ ఆర్డీవో ఇ.అర్చన, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కస్టమర్లను మోసం చేస్తే ఊరుకోం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్యాకింగ్ ఫుడ్ ప్రొడక్ట్స్‌పై ఈ మధ్యకాలంలో భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఫుల్ ఫోకస్ పెట్టింది. సదరు కంపెనీలు చేస్తున్న తప్పుడు ప్రకటనలు, కస్టమర్లను తప్పుదోవ పట్టించేలా క్లెయిమ్ చేస్తున్న అంశాలపై డైరెక్ట్‌గా యాక్షన్‌లోకి దిగింది. ఈ క్రమంలోనే పలు దిగ్గజ కార్పొరేట్ బ్రాండ్లకు సైతం లీగల్ నోటీసులు ఇచ్చేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏమాత్రం వెనుకాడటం లేదు. తాజాగా ప్రముఖ చాక్లెట్, కన్ఫెక్షనరీ బ్రాండ్ లోట్టే ఇండియా , గిఫ్టింగ్ పోర్టల్ ఫెర్న్స్ ఎన్ పెటల్స్ తో పాటు కుబేర ఫుడ్స్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ.. వారిపై ఎందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయా కంపెనీలను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది.

**100 శాతం వెజిటేరియన్ అంటూ క్లెయిమ్..**

వివరాల్లోకి వెళితే.. చాక్లెట్ బ్రాండ్ లోట్టే ఇండియాకు చెందిన కొన్ని 'చోకో పై' ఉత్పత్తులపై 100 శాతం వెజిటేరియన్ క్లెయిమ్స్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫ్లాగ్ చేసింది. వీటితో పాటు కంపెనీకి చెందిన ఫ్రూట్జ్ ఎక్లైర్స్ చాక్లెట్లలో అసలు పండ్ల కంటెంట్ లేకపోయినప్పటికీ.. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఆ పేరును వాడుతున్నట్లు గుర్తించింది. అదేవిధంగా మరో సంస్థ రోస్టెడ్ ఆల్మండ్ చాక్లెట్ పై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చాక్లెట్‌లో హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్ ఉన్నప్పటికీ, దానిని ప్రీమియం చాక్లెట్‌గా మార్కెట్ చేస్తున్నట్లు తేల్చింది. ఇక కుబేర ఫుడ్స్ సాఫ్ట్ అండ్ ఫ్రెష్ క్రీమ్ బన్ పైనాపిల్ ప్యాకెట్‌పై 100 శాతం నేచురల్, నో ప్రిజర్వేటివ్స్, కలర్స్ అండ్ ఫ్లేవర్స్ అని ముద్రించారు. కానీ, లోపల ఉన్న లేబుల్‌పై మాత్రం ప్రిజర్వేటివ్స్, సింథటిక్ ఫుడ్ కలర్, అదనపు ఫ్లేవర్స్ వాడినట్లు ప్రింట్ చేయడంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆ మూడు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ప్రతి సంస్థ తమ ప్రొడక్ట్స్‌కు సంబంధించి కస్టమర్లకు సరైన సమాచారం ఇవ్వాలని.. లేని పక్షంలో భాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆర్థిక సాయం





**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎద్దుల శంకర్ (శ్రీకాంత్) మిడ్జిల్ లో జరిగిన ముఖ్యమంత్రి బహిరంగ సభలో సొమ్మసిల్లి పడిపోవడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 5:00 గంటలకు శంకర్ మృతి చెందాడు, విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి. శంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి 10.పదివేల రూపాయలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్,నరేందర్ , శ్రీధర్ రెడ్డి , ఎన్నం వేంకటేశ్వర రెడ్డి,మట్ట అంజయ్య, ,చంద్రధన మాజీ ఎంపిటిసి రాములు, మచ్చేందర్, ఏధుల మహేష్, భాస్కర్, గౌస్, నాగేష్, తది తరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ సర్కిల్ లో పర్యటించిన కమిషనర్



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడ పరిధిలోని బుద్ధ నగర్ కాలనీలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆకస్మిక పర్యటన చేశారు. కాలనీలో జరుగుతున్న పారిశుధ్యం, మొక్కల పెంపకం, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల నిర్వహణ, తదితర అంశాలపై పర్యవేక్షించారు. సంబంధిత అధికారులు, ప్రజలతో పలు సమస్యలను తెలుసుకుని సూచనలు, సలహాలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, పచ్చదనం పరిశుభ్రంపై , ప్రజల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, జంగారెడ్డి, ఇంద్రారెడ్డి, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు వైఎస్ఆర్



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దివంగత మహానేత,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా పలు చోట్ల వారి చిత్రపటానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని అన్నారు.రైతులు,పేదలు,మహిళలు, విద్యార్థులు,వృద్ధులు సహా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనసుల్లో చిరస్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి,సంక్షేమ పాలనకు కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడిగా వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలు,ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళులు అర్పించారు.

# కాకరవాయి చేపల చెరువు వద్ద ఘర్షణ...



**తిరుమలాయపాలెం,ఫ్లాష్ ఇండియా :** చేపల చెరువు విషయంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో పలువురికి గాయాలైన ఘటన బుధవారం తిరుమలాయపాలెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని కాకరవాయి గ్రామంలోని మద్దుల చెరువులో బుధవారం ఓ వర్గం చేపలు పడుతుండగా మరో వర్గం నిరాకరించింది. ఈ విషయమై ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి పెద్ద ఘర్షణ జరిగింది. దీంతో గతంలో చెరువులో వినాయకుని విగ్రహాలు నిమజ్జనం చేయగా, అట్టి బొమ్మల కర్రలతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంమే కాకా రాళ్లు సైతం రువ్వుకున్నారు. ఈ దాడిలో ఇరువర్గాల పురుషులతో పాటు, మహిళలు సైతం గాయపడ్డారని సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘర్షణ స్థలానికి చేరుకొని శాంతి భద్రతలు కాపాడారు. ఈ ఘర్షణ పై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభమైనందున మొదటి విడతలో నిర్మిస్తున్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో వివిధ అంశాలపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 36 శాతం మొక్కలు మాత్రమే నాటారని, జూలై 15 తర్వాత ఇంటింటికి కూడా మొక్కలు పంపిణీ చేసి లక్ష్యాలకు చేరువ కావాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు.పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని ఎంపీడీఓలకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం మండలాలు, పురపాలికల వారీగా వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యనాథ ఆలయానికి నిధులు మంజూరు



**ధర్మసాగర్,ఫ్లాష్ ఇండియా :** ముప్పారం గ్రామంలోని ప్రాచీన ముఖ్యనాథస్వామి దేవాలయ అభివృద్ధికి దేవాదాయ మంత్రి కొండా సురేఖ నిధులు మంజూరు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం సీఎజీఎఫ్ నిధుల నుంచి రూ.1.10 కోట్లు విడుదల చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ పునః వ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్ రవీంద్ర చేసిన విజ్ఞప్తికి స్పందించిన మంత్రి కొండా సురేఖ, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి ప్రాచీన దేవాలయ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో శివసాని ప్రవీణ్ రవీంద్రకు నిధుల మంజూరు ప్రొసీడింగ్స్ కాపీని మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసినందుకు మంత్రి కొండా సురేఖకు ఆలయ జ్ఞాపికను అందజేసిన శివసాని ప్రవీణ్ రవీంద్ర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ప్రజాప్రతినిధులు గడ్డం రాజేందర్, పెద్ది శ్రీనివాస్, ఆలయ పునః వ్యవస్థాపకులు శివసాని ప్రవీణ్, ఉపాధ్యక్షులు మోడెం రవి, ఎర్ర చేరాలు, ప్రధాన కార్యదర్శి దారపు చంద్రయ్య, ఉప కార్యదర్శులు మద్రిపల్లి రాజు, సులుగూరి రాజు, పారుపల్లి రవిత, కుమ్మం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు ఆమోదం







**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈరోజు ఉదయం 10:30 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్ నందు గౌరవ మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడకాంచి బాలమణి గారి అధ్యక్షతన అత్యంత సౌహార్దపూర్వక వాతావరణంలో నిర్వహించబడింది.ఈ సమావేశంలో జనగామ పట్టణ పరిధిలోని పలు వార్డుల అభివృద్ధి పనులు, ప్రజల మౌలిక వసతుల కల్పనపై కౌన్సిల్ సభ్యులు వివిధ డిపార్ట్మెంట్స్ శాఖాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు అనంతరం భోజనం విరామం తర్వాత సాయంత్రం 4.00 గంటలకు కౌన్సిల్ సమావేశము తిరిగి ప్రారంభించబడింది మరియు ఇట్టి సమావేశంలో ఇటీవల లైన్మెన్ గారు చనిపోయినందున వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించడం జరిగింది.

**ఇట్టి సమావేశంలో (51) ఎజెండా అంశములను కౌన్సిల్ యందు ప్రవేశపరచగా, ఆమోదించడం జరిగింది. అందులో ముఖ్యమైనవి.**

1. పట్టణంలోని 30 వార్డులలో కోతుల నివారణ చర్యలకి రూ.15.00 లక్షలు కేటాయించారు.
2. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా 2,50,000 మొక్కలు నాటుటకు ఆమోదం తెలిపినారు.
3. పట్టణంలోని విద్యుత్ దీపాల సమస్యలపై రూ.5.00 లక్షల రూపాయలను కేటాయించడం జరిగినది.
4. పట్టణంలో వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రారంభించుటకు ఆమోదం తెలిపినారు.
5. పట్టణంలోని ప్రజలకు శుద్ధమైన జలాలు అందించుటకు గాను నిధులు కేటాయించి ఆమోదం తెలిపినారు.
6. కుక్కల, పందుల నివారణ చర్యలకు కూడా ఆమోదం తెలిపినారు.
7. జంతువధ శాల టెండర్ రూ.5.00 లక్షలకు పిలుచుటకు గాను ఆమోదం తెలిపినారు.
8. జనగామ పట్టణములోని (4) ప్రధాన రహదారులకు ఇరవైపుల మరియు ఇతర ప్రాంతాలలో ఉన్న వ్యాపారస్తులకు మరియు షాపుల నుండి చెత్త, వ్యర్థాలను బహిరంగ కూధళ్ళలో, మురికి కాలువలలో వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు నేరుగా అందించవలెను, అలా కాకుండా రోడ్లపై చెత్తను మరియు ఇతర సామాన్లు ఉన్నచో వారికి చట్ట పరమైన చర్యలు తీసుకొని మరియు రూ.500/-ల నుండి రూ.50,000/-ల వరకు ఫైన్లు వేయవల్సిందిగా శ్రీయుత ఛైర్పర్సన్ & కమీషనర్ గారలు ఆదేశించినారు.

ఇట్టి సమావేశంలో గౌరవ చైర్ పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి గారు, గౌరవ వైస్ చైర్మన్ గారు, గౌరవ కమిషనర్ గారు, గౌరవ కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు మరియు మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలిప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GPDP) ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు.

**ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు.ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పన జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ భాస్కర్, డీపీఓ వెంకట్ రెడ్డి, ఈజేఎస్ పీడీ సూరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ఉత్పత్తుల కనిష్ఠ ధరలపై పునః సమీక్ష



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** అటవీ ఉత్పత్తుల కనిష్ట ధరలను పునః సమీక్షించడంతో పాటు మార్కెట్ పరిస్థితులను అనుకూలంగా దోహదపడుతుందని ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ సయ్యద్ ఆరిఫ్ వలీ అన్నారు. అటవీ కనిష్ట ధరలపై బుధవారం కొత్తగూడెంలోని అటవీశాఖ భద్రా మీటింగ్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... 87 రకాల చిన్న అటవీ ఉత్పత్తుల్లో ప్రస్తుతం ఉన్న కనిష్ఠ ధరలపై టేరి ఆధ్వర్యంలో సర్వే చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గిరిజనులకు అటవీ ఉత్పత్తుల పై న్యాయమైన ధరలు కల్పించేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు గిరిజన ప్రాంతాల్లో సర్వే చేయడం జరుగుతుందన్నారు. అనంతరం చీఫ్ కన్జర్వేటర్ బీమా నాయక్ మాట్లాడుతూ... టేరి ఆధ్వర్యంలో నిర్వహించే అటవీ ఉత్పత్తుల ధరల సర్వే గిరిజనులకు ఎంతో దోహదపడుతుందని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ జిల్లా అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సమ్మయ్య, టేరి బాధ్యులు నేహా శర్మ, చందన్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

# ‘వీ వాంట్ సంజూ’.. కోచ్ కీలక వ్యాఖ్యలు.!

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 125 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు మరింత పెరిగాయి. ముఖ్యంగా సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించడంపై అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడో టీ20 మ్యాచ్ తర్వాత స్టేడియం బయట గంభీర్‌ను చూసిన అభిమానులు “వీ వాంట్ సంజూ.. సంజూ” అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

**సంజూను తప్పించడంపై ఆగ్రహం:**

ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయిన సంజూ శాంసన్, ఇంగ్లండ్‌తో తొలి టీ20లో కూడా విఫలమయ్యాడు. దీంతో అతడిని రెండో, మూడో టీ20లకు పక్కనబెట్టి యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇచ్చారు. అయితే ఈ నిర్ణయం అభిమానులకు ఏమాత్రం నచ్చలేదు. సోషల్ మీడియాలో గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

**జింబాబ్వే సిరీస్‌కూ:**

భారత్ జింబాబ్వే పర్యటనకు ప్రకటించిన టీ20 జట్టులో కూడా సంజూ శాంసన్‌కు చోటు దక్కలేదు. దీంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. గత టీ20 ప్రపంచకప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’గా నిలిచిన ఆటగాడిని ఇలా పక్కన పెట్టడమేంటని అభిమానులు ప్రశ్నించారు. గంభీర్ ఇచ్చిన హామీలను కూడా గుర్తుచేస్తూ విమర్శలు గుప్పించారు.

**సంజూపై గంభీర్ కీలక వ్యాఖ్యలు:**

మూడో టీ20లో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడిన గౌతమ్ గంభీర్.. సంజూ శాంసన్‌పై స్పందించాడు. 2026 టీ20 ప్రపంచకప్‌లో సంజూ చేసిన ప్రదర్శన అసాధారణం. అయితే కొన్ని సందర్భాల్లో ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. సంజూ తిరిగి జట్టులోకి రాకూడదనే ఎలాంటి నియమం లేదు. ప్రతి ఆటగాడు తన స్థానాన్ని మళ్లీ సంపాదించుకోవాలని గంభీర్ స్పష్టం చేశాడు.

**ఎందుకు పక్కన పెట్టారు?**

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన సంజూ శాంసన్‌కు ఆ తర్వాత మాత్రం బ్యాట్ సహకరించలేదు. ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 5 పరుగులే చేసిన అతడు, ఇంగ్లండ్‌తో తొలి టీ20లో ఒకే పరుగుకు ఔటయ్యాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలోనే జట్టు యాజమాన్యం అతడిని బెంచ్‌పై కూర్చోబెట్టి యువ ఆటగాడికి అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**గెలుపు లేక ఒత్తిడిలో టీమిండియా:**

శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో భారత జట్టు వరుసగా ఐదు టీ20 మ్యాచ్‌ల్లో (ఒకటి వర్షంతో రద్దు) విజయాన్ని నమోదు చేయలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో జట్టు ఎంపిక, బ్యాటింగ్ కూర్పుపై ప్రశ్నలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా సంజూ శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని అభిమానులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# భారత్ ఘోర ఓటమి



ఇంగ్లండ్ తో జరిగిన మూడవ T20 లో భారత్ ఘోర ఓటమి పాలైంది. 76 పరుగులకే ఆల్ ఔటయ్యి భారీ పరాజయాన్ని మూట గట్టుకుంది. టాస్ గెలిచిన టీంఇండియా బౌలింగ్ ఎంచుకోగా.. ఇంగ్లండ్ మొదట బ్యాటింగుకు దిగింది. నిర్ణీత 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్(70), శామ్ కరన్(40), బట్లర్(36) పరుగులతో రాణించారు. అనంతరం 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత బ్యాటర్లంతా చేతులెత్తేశారు. 11.4 ఓవర్లలో 76 పరుగులకే ఆల్ ఔట్ కాగా.. ఏ ఒక్క బ్యాటర్ 20 రన్స్ కూడా చేయలేదు. అభిషేక్ శర్మ (10), వైభవ్ సూర్యవంశీ (13), ఇషాన్ కిషన్ (13), అక్షర్ పటేల్ (10), హర్షిత్ రాణా (9) శ్రేయస్ అయ్యర్ (5), వరుణ్ చక్రవర్తి (5), అర్ష్‌దీప్ సింగ్ (4), తిలక్ వర్మ (3), శివమ్ దూబె (2) పరుగులు చేశారు. వచ్చినవాళ్లను వచ్చినట్టే ఇంగ్లండ్ బౌలర్లు పెవిలియన్ కు పంపారు. ఇంగ్లండ్ బౌలర్లలో టంగ్ 4, ఆర్చర్ 3, రషీద్ 2, జాక్స్ ఒక వికెట్ తీశారు. ఐదు ం20 మ్యాచుల సిరీస్ లో ఇంగ్లండ్ 2-0 తో లీడ్ లో ఉంది.



# 14 నిమిషాల్లో 3 గోల్స్..

డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ఫిఫా ప్రపంచకప్ 2026లో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో చివరి 14 నిమిషాల్లో 3 గోల్స్ చేసి ఈజిప్ట్‌పై 3-2తో సంచలన విజయం సాధించి క్వార్టర్స్ లోకి అడుగుపెట్టింది. ఒక దశలో 78వ నిమిషం వరకు 0-2తో వెనుకబడిన అర్జెంటీనా.. లియోనెల్ మెస్సీ నాయకత్వంలో అద్భుతంగా పుంజుకుని క్వార్టర్ లోకి అర్హత సాధించింది. నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాధించిన ఈ మ్యాచ్ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసిందనడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు.

**ఈజిప్ట్ మాయ:**

మ్యాచ్ ప్రారంభం నుంచే బంతిపై అర్జెంటీనా ఆధిపత్యం చెలాయించినా.. గోల్ మాత్రం ఈజిప్ట్ ఖాతాలో పడింది. 15వ నిమిషంలో యాసిర్ ఇబ్రహీం కార్నర్ కిక్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత పెనాల్టీ రూపంలో అర్జెంటీనాకు సమం చేసే అవకాశం వచ్చినా, మెస్సీ కొట్టిన స్పాట్ కిక్‌ను ఈజిప్ట్ గోల్‌కీపర్ మొస్తఫా షోబిర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత అర్జెంటీనా వరుస దాడులు చేసినప్పటికీ.. ఈజిప్ట్ రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ఫస్ట్ హాఫ్ లోనే అలెక్సిస్ మెక్ అలిస్టర్, జూలియన్ అల్వరెజ్ చేసిన ప్రయత్నాలను కూడా షోబిర్ సమర్థంగా అడ్డుకోవడంతో అర్జెంటీనా వెనుకపడింది. ఇక రెండో అర్ధంలో కూడా అర్జెంటీనా దాడులు కొనసాగించినా ఫలితం కనిపించలేదు. 67వ నిమిషంలో మొస్తఫా జికో మరో అద్భుత గోల్ చేయడంతో ఈజిప్ట్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అప్పటికే మ్యాచ్‌లో మరో 20 నిమిషాల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో డిఫెండింగ్ ఛాంపియన్ టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమైంది.

**ఆశ్చర్యపరిచిన అర్జెంటీనా:**

చివరి 20 నిమిషాలలో మ్యాచ్ పూర్తిగా మారిపోయింది. 79వ నిమిషంలో మెస్సీ ఇచ్చిన అద్భుత క్రాస్‌ను క్రిస్టియన్ రొమెరో హెడర్ తో గోల్‌గా మలిచి అర్జెంటీనాకు ఆశలు కల్పించాడు. ఆపై నాలుగు నిమిషాలకే లాటారో మార్టినెజ్ పాస్‌ను అందుకున్న లియోనెల్ మెస్సీ పవర్‌ఫుల్ షాట్‌తో గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేశాడు.

ఇక ఇంజరీ టైమ్‌లో కూడా దాడులు ఆపని అర్జెంటీనా చివరకు 90ం2వ నిమిషంలో విజయగోల్ నమోదు చేసింది. మార్టినెజ్ అందించిన క్రాస్‌ను ఎంజో ఫెర్నాండెజ్ హెడర్‌తో గోల్‌గా మలచడంతో స్టేడియం మొత్తం అర్జెంటీనా అభిమానుల సంబరాలతో మార్మోగిపోయింది. 14 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ సాధించిన అర్జెంటీనా అసాధారణ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.

**గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ దూకుడు:**

ఈ మ్యాచ్‌లో కీలక గోల్ చేసిన లియోనెల్ మెస్సీ ప్రస్తుత ప్రపంచకప్‌లో తన గోల్స్ సంఖ్యను 8కు పెంచుకున్నాడు. దీంతో గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాపె, నార్వే స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ చెరో 7 గోల్స్‌తో మెస్సీకి పోటీగా కొనసాగుతున్నారు.

# బిజినెస్



## మళ్లీ కుప్పకూలిన గోల్డ్ రేట్లు..

బంగారం , వెండి కొనుగోలు చేయాలనుకునే పేద, మధ్య తరగతి ప్రజలకు సువర్ణాకాశం రానే వచ్చింది. తాజాగా హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు వరుసగా నాలుగో రోజు కూడా పతనమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగానూ బంగారం, వెండి ధరలు భారీగా కిందకు దిగివచ్చాయి. ఇవాళ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.770 మేర తగ్గి రూ.1,44,490కి చేరింది. అదేవిధంగా ఆభరణాల తయారిలో వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పతనమై రూ.1,32,450 పలుకుతోంది.

**ఏకంగా రూ.5,000 పతనమైన వెండి**

ఇక బంగారంతో పాటే వెండి ధర కూడా కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చేలా పడిపోయాయి. ఇవాళ మార్కెట్‌లో కేజీ వెండి ధర ఏకంగా రూ.5 వేల తగ్గి రూ.2,45,000కి చేరింది. వరుస రోజుల్లో ధరలు దిగిరావడంతో మార్కెట్లలో కొనుగోళ్ల సందడి పెరిగే అవకాశం కనిపిస్తోంది. అయితే, రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, షోరూమ్‌లను బట్టి బంగారం ధరల్లో స్వల్ప మార్పులు ఉంటాయి.

## ప్రపంచవ్యాప్తంగా చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం



ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ కి చెందిన చాట్‌జీపీటీ సేవల్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాట్‌జీపీటీ ప్రాంప్ట్ సర్వీస్‌లతో పాటు ఇమేజ్ జనరేషన్ (DALL-Eతోపాటు ఇతర అనుబంధ సేవల్లోనూ సాంకేతిక సమస్యలు తలెత్తాయి. చాట్‌జీపీటీ పనిచేయడం లేదంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు సోషల్ మీడియా వేదికగా స్క్రీన్‌షాట్లను షేర్ చేస్తూ పోస్టులు పెట్టారు.

**సంస్థ స్పందన ఇదే**

ఈ గ్లోబల్ అవుటేజ్‌పై ఓపెన్‌ఏఐ సంస్థ వెంటనే స్పందించింది. తమ చాట్‌జీపీటీ సేవల్లో సాంకేతిక సమస్య ఏర్పడిన మాట వాస్తవమేనని, యూజర్ల నుంచి కూడా దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. సమస్యను గుర్తించిన వెంటనే కంపెనీకి చెందిన ఇంజినీరింగ్ బృందం రంగంలోకి దిగిందని, పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు తీసుకున్న తక్షణ చర్యల వల్ల ఇప్పటికే చాట్‌జీపీటీ సేవలు చాలా వరకు పునరుద్ధరించబడినట్లు ఓపెన్‌ఏఐ తాజా అప్‌డేట్‌లో తెలిపింది. అయితే ఇమేజ్ జనరేషన్ వంటి మరికొన్ని సేవల్లో ఇంకా అక్కడక్కడా అంతరాయం కొనసాగుతోందని, వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి పూర్తి స్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని కంపెనీ యూజర్లకు స్పష్టం చేసింది.

## గ్యాస్ సిలిండర్ ధరలు

రీసెంట్‌గా కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు.

**జులై 8వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు..**



హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

## నిమిషాల్లోనే తుడిచిపెట్టుకుపోయిన వేల కోట్లు!



అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. అమెరికా -- ఇరాన్ మధ్య రేగిన ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను వణికించాయి. మార్కెట్ ప్రారంభమైన మొదటి ఐదు నిమిషాల వ్యవధిలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 550 పాయింట్లకు పైగా పతనం అవ్వగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 150 పాయింట్లకు పైగా తుడిచిపెట్టుకొని పోయింది. అంతకుముందు రోజు కూడా మార్కెట్లు నష్టాల్లోనే ముగియడం గమనార్హం.

**సెంటిమెంట్‌ను దెబ్బతీసిన ‘హోర్ముజ్’ సంక్షోభం**

ప్రపంచ చమురు అవసరాలలో దాదాపు 20 శాతం వాటాను మోసే అత్యంత కీలకమైన ‘హోర్ముజ్ జలసంధి’ వేదికగా అమెరికా, ఇరాన్ దళాలు పరస్పరం దాడులకు దిగడమే ఈ రోజు మార్కెట్ పతనానికి ప్రధాన కారణం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ భౌగోళిక -- రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం కేవలం భారత్‌పైనే కాకుండా జపాన్, సౌత్ కొరియా వంటి ఇతర ఆసియా దేశాల స్టాక్ మార్కెట్లపైనా తీవ్రంగా పడిందని చెబుతున్నారు. మంగళవారం ముగింపు 78,180 పాయింట్లతో పోలిస్తే బుధవారం ఉదయం భారీ గ్యాప్ డౌన్‌తో ప్రారంభమైన సెన్సెక్స్, కొద్దిసేపట్లోనే 550 పాయింట్లు నష్టపోయి 77,611 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ ఇండెక్స్ కూడా తన మునుపటి ముగింపు 24,398 పాయింట్ల నుంచి ఓపెనింగ్‌లోనే 24,259 వద్దకు పడిపోయి, ఆ తర్వాత మరింత క్షీణించి 150 పాయింట్ల నష్టంతో 24,229 వద్ద ట్రేడ్ అయింది.

**మార్కెట్లలో భయానికి 3 ముఖ్య కారణాలు ఇవే..**

హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న మూడు వాణిజ్య నౌకలపై ఇరాన్ మిసైల్ దాడులు చేయగా, దానికి బదులుగా అమెరికా సైన్యం ఇరాన్ స్థావరాలపై వైమానిక దాడులు ప్రారంభించడం గ్లోబల్ మార్కెట్లను భయపెట్టింది.

అంతర్జాతీయ మార్కెట్లలో సెంటిమెంట్ దెబ్బతినడంతో జపాన్ సూచీ ‘నిక్కీ’ ఓపెనింగ్‌లోనే 500 పాయింట్లకు పైగా పతనమవగా, సౌత్ కొరియా సూచీ ‘కోస్పి’ 1 శాతం పైగా నష్టపోయింది. గిఫ్ట్ నిఫ్టీ కూడా రెడ్ జోన్‌లోనే ట్రేడ్ అయింది.

దాడుల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. బ్రెంట్ ముడి చమురు 3 శాతం పైగా పెరిగి బ్యారెల్‌కు 76 డాలర్ల మార్కును దాటింది. డబ్ల్యూటీఐ (WTI) కూడా 72 డాలర్ల పైనే ట్రేడ్ అవుతోంది. ఈ చమురు ధరల పెరుగుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందనే ఆందోళన ఇన్వెస్టర్లను వెనక్కి తగ్గేలా చేసింది. ఈ రోజు మార్కెట్‌లో అత్యధికంగా నష్టపోయిన స్టాక్‌ల విషయానికి వస్తే, బీఎస్ఈ లార్జ్‌క్యాప్ కేటగిరీలోని ఇండిగో (2.50%), ఏషియన్ పెయింట్స్ (2.42%), రిలయన్స్ (2.10%), బజాజ్ ఫైనాన్స్ (1.70%), ఐటీసీ (1.60%), ఎండఎం (1.50%) నష్టాలతో ట్రేడవుతున్నాయి. ఇవి కాకుండా, మిడ్‌క్యాప్ కేటగిరీలోని హిందుస్థాన్ పెట్రోలియం (3.60%), అశోక్ లేలాండ్ (2.60%) కూడా నష్టాలతో ట్రేడవుతున్నాయి. స్మాల్‌క్యాప్ జాబితాలోని ఎన్‌బీసీసీ (2.20%), పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ (2.10%) షేర్లు నష్టాలతో ట్రేడవుతున్నట్లు కనిపించాయి.




# నెవర్ బిఫోర్ ఇన్ టాలీవుడ్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ పాన్-ఇండియా చిత్రం 'డ్రాగన్'. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేయడమే కాకుండా సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లింది. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ఒక సెన్సేషనల్ న్యూస్ తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించే రేంజ్‌లో ప్రశాంత్ నీల్ ఒక మైండ్ బ్లోయింగ్ ఇంటర్వెల్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు ఇండస్ట్రీ టాక్.సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమాల్లో ఇంటర్వెల్ బ్లాక్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతోనే రుజువైంది. అయితే 'డ్రాగన్' కోసం అంతకుమించి అనేలా అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ఈ ఇంటర్వెల్ ఎపిసోడ్‌ను డిజైన్ చేస్తున్నారట. ఈ ఎపిసోడ్ థియేటర్లలో ప్రేక్షకులకు ఒక ఊహించని విజువల్ ఫీస్ట్‌లా మార బోతుందని సమాచారం. మరోవైపు ఈ సినిమా విజువల్స్ పరంగా ప్రశాంత్ నీల్ తన మార్క్ స్టైల్‌ను పక్కన పెట్టి ఒక సరికొత్త ప్రయోగం చేయబోతున్నాడట నీల్. రెగ్యులర్ గా నీల్ సినిమాల్లో కనిపించే సిగ్నేచర్ డార్క్ థీమ్ గ్రే షేడ్స్ కాకుండా.. 'డ్రాగన్' ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ మొత్తం చాలా కలర్‌ఫుల్‌గా, వైబ్రంట్ విజువల్ ప్యాలెట్‌తో రిచ్‌గా ఉండబోతున్నాయట. ఈ కలర్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్ కథకు ఒక ప్రత్యేకమైన వేరియేషన్‌ను తీసుకురానుందని టాక్. ఇక ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలోని మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ బాలీవుడ్ క్రేజీ బ్యూటీ కృతి సనన్ క్యారెక్టర్ ఎంట్రీ ఇవ్వబోతుందట.

కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక అత్యంత కీలకమైన పాత్రలో కృతి కనిపించనుందని సినిమాలో ఆ క్యారెక్టరే మెయిన్ పిల్లర్ అని వినికిడి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ క్రేజీ ప్రాజెక్ట్ వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# కొత్త దర్శకుడితో కలిసి మెగాఫోన్!




ప్రస్తుతం ఒకవైపు పూజా హెగ్డేతో 'కాంచన 4'ను తెరకెక్కిస్తూనే, మరోవైపు స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ నిర్మాణంలో రూపొందుతున్న 'బెంజ్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్యే తన సొంత నిర్మాణ సంస్థపై కొత్త సినిమాను ప్రకటించడం విశేషంగా మారింది. అయితే ఇది ఆయన కెరీర్‌లో 30వ చిత్రం కావడంతో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సినిమాలో తోడుగా పుగళ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేయనున్నారు లారెన్స్. ఇప్పటికే విజయవంతమైన దర్శకుడిగా గుర్తింపు పొందిన లారెన్స్, ఒక కొత్త వ్యక్తితో దర్శకత్వ బాధ్యతలు పంచుకోవడం ఆసక్తికరంగా మారింది. కొత్త టాలెంట్‌కు అవకాశాలు కల్పించడంలో ఎప్పుడూ ముందుండే లారెన్స్ మరోసారి అదే ఆలోచనతో ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు ప్రస్తుతం దక్షిణాదిలో వరుస అవకాశాలు అందుకుంటున్న యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం అందించనున్నారు. చిత్రానికి సంబంధించిన పూర్తి తారాగణం, సాంకేతిక బృందంతో పాటు ప్రత్యేక అనౌన్స్‌మెంట్ ను ఈ నెల 12న విడుదల చేయాలని చిత్రబృందం సిద్ధమవుతోంది. ఇప్పటివరకు హారర్ కామెడీలతో ప్రేక్షకులను అలరించిన రాఘవ లారెన్స్, ఈ కొత్త దర్శకుడి కాంబినేషన్‌లో ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడో చూడాలి.

# వద్దు అని చెప్పిన నాన్న అలాంటి...



మల్టీ స్టారర్‌గా ఇండస్ట్రీలో దూసుకుపోతున్న శృతి హాసన్.. రీసెంట్‌గా 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్‌తో ప్రేక్షకులను అలరించింది. ప్రజెంట్ రెండు, మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ హీరోయిన్.. తన తండ్రితో తనకు ఉన్న రిలేషన్ గురించి తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'నాన్న నాతో చాలా సరదాగా ఉంటారు. ఆయన నాకు ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా ఫన్నీ రీల్స్ పంపుతుంటారు. కొన్నిసార్లు అవి కాస్త విచిత్రంగా అనిపిస్తాయి.. అప్పుడు నేను ఆయనతో 'నాన్నా, ఈ ఆంటీ చేసేవి అంతగా నవ్వు తెప్పించేలా ఉండవు' అని చెబుతుంటాను. అలాగే కళాత్మకమైన వీడియోలను కూడా నాకు షేర్ చేస్తుంటారు. ఒక చిన్న పాప పాట పాడుతున్న వీడియోను పంపినప్పుడు, అది నన్ను గుర్తుచేసుకుని పంపారని నాకు అర్థమవుతుంది.. అలాంటివి చాలా ముచ్చటగా అనిపిస్తాయి. పల్లెటూళ్ళలో వంట చేసేవారి వీడియోలు, సంగీతకారులు, కళలకు సంబంధించిన విషయాలంటే ఆయనకు చాలా ఇష్టం. వాటిని నాతో కూడా షేర్ చేసుకుంటారు' అని వారి మధ్య ఉన్న బాండింగ్ గురించి చెప్పుకొచ్చింది శృతి హాసన్.

లేడీ సూపర్ స్టార్ నయనతార గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఎన్నో ఏళ్లుగా స్టార్ హీరోయిన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంటూ విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తున్న అతికొద్ది మంది కథానాయికల్లో ఆమె ఒకరు. కెరీర్ ప్రారంభంలో పలు చిత్రాల్లో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నయనతార, గత కొంతకాలంగా గ్లామర్ షోకు దూరంగా ఉంటూ క్లాస్ ఇమేజ్‌ను కొనసాగిస్తున్నారు.అలాగే సోషల్ మీడియాలో కూడా పెద్దగా యాక్టివ్‌గా లేకపోయినా, అప్పుడప్పుడు అభిమానులతో తన ఫోటోలను పంచుకుంటూ ఉంటారు. తాజాగా నయనతార తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బ్లూ కలర్ చీరలో మెరిసిపోయే ఫోటోలను షేర్ చేశారు. ఆ చీరకు తగ్గట్టుగా సింపుల్ బ్లౌజ్ ధరించి, నుదుటిపై బొట్టు, ఒక చేతికి గాజులు, మరో చేతికి వాచ్, పెద్ద ఇయర్‌రింగ్స్‌తో సంప్రదాయ లుక్‌లో ఆకట్టుకున్నారు.అందంగా ముడివేసిన జడలో పూలు అలంకరించుకోవడంతో ఆమె లుక్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణ వచ్చింది. టోటల్‌గా క్లాస్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో నయనతార మెరిసిపోవడంతో ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం 41 ఏళ్ల వయసులోనూ అదే అందం, అదే హుందాతనంతో కనిపిస్తుండటంతో అభిమానులు "యంగ్ హీరోయిన్లకు నయనతార గట్టి పోటీ ఇస్తున్నారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# 40లోనూ యంగ్ బ్యూటీలకు గట్టి పోటీ



# 'మారెమ్మ' విడుదలపై మేకర్స్ కీలక నిర్ణయం




మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు 'మారెమ్మ' చిత్రంతో వెండితెరకు హీరోగా పరిచయం కానున్నాడు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సస్పెన్స్, డివోషనల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో దీపా బాలు హీరోయిన్‌గా నటిస్తుండగా, వినోద్ కుమార్, రూప్ లక్ష్మి, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ప్రశాంత్ ఆర్. విహారి సంగీతం అందిస్తుండగా, అంకిరెడ్డి ప్రశాంత్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. అయితే చివరి నిమిషంలో సినిమా విడుదలను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త విడుదల తేదీని మరికొన్ని రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# ఆ సినిమా టైమ్‌లోనే అలా!

తనకు జాతీయ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమీ' సినిమా షూటింగ్ సమయంలోనే తాను ఈ 'ఎగ్ ఫ్రీజింగ్' ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు వివరించారు. ఆ సినిమాలో గర్భిణీగా కనిపించడం కోసం ఆమె దాదాపు 15 కిలోల బరువు పెరిగారు. "ఆ సమయంలో నా హార్మోన్లలో చాలా మార్పులు వచ్చాయి. భవిష్యత్తులో అమ్మతనం (తల్లి కావడం) విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ముందుచూపుతో, వైద్యుల సలహా మేరకు బరువు పెరుగుతున్న ఆ ఫేజ్‌లోనే నా అండాలను భద్రపరుచుకున్నాను" అని కృతి వెల్లడించారు."మనం కెరీర్‌పై ఫోకస్ పెట్టినప్పుడు, మన బాడీకి సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను ముందే ప్లాన్ చేసుకోవడం తప్పు కాదు" అని కృతి సనన్ చెప్పుకొచ్చారు. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లు పెళ్లి, పిల్లల గురించి ఆలోచించడం కొంచెం ఆలస్యమవుతుంటుంది. వయసు పెరిగేకొద్దీ మహిళల్లో అండాల నాణ్యత తగ్గే అవకాశం ఉన్నందున, ముందే వాటిని ఫ్రీజ్ చేయడం వల్ల భవిష్యత్తులో ఎప్పుడైనా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వచ్చని అన్నారు. గతంలో ప్రియాంకా చోప్రా, ఏక్తా కపూర్ వంటి తారలు కూడా ఎగ్ ఫ్రీజింగ్ గురించి ఓపెన్‌గా మాట్లాడగా.. ఇప్పుడు కృతి సనన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె తీసుకున్న బోల్డ్ అండ్ మెచ్యూర్డ్ డెసిషన్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# బాధ్యత మరింత పెరిగింది..

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లై ఓ బిడ్డకు తల్లి అయ్యాక సినిమాల విషయంలో కాస్త జాగ్రత్తలు పాటిస్తున్నారు. అచీతూచీ అడుగులు వేస్తూ.. భారీ చిత్రాలను ఎంపిక చేసుకుంటున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా రాణించిన ఆమె తల్లి అయిన తర్వాత వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం కాజల్ నటించిన 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' వంటి భారీ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' సినిమా జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్స్‌లో కాజల్ పాల్గొని, తన వ్యక్తిగత జీవితం, మూవీస్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తాను తల్లి అయిన తర్వాత సినిమాలు ఎంచుకునే పద్ధతి పూర్తిగా మారిపోయిందని కాజల్ చెప్పారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇప్పుడు ఏ కథ విన్నా తన కొడుకు కోణంలోనే ఆలోచిస్తున్నానని, భవిష్యత్తులో అమ్మ చాలా మంచి సినిమా చేసిందని వాడు గర్వంగా చెప్పుకోవాలనేదే తన తాపత్రయమని తెలిపారు.అందుకే ఎలాంటి చిత్రాలు చేయాలనే దానిపై తనకు ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చిందని చెప్పారు. తన కొడుకు నీల్‌కు రామాయణం కథ అంటే చాలా ఇష్టమని, ఇంట్లో రోజూ రామలీలా చూస్తుంటాడని కాజల్ వెల్లడించారు. తాను నితేష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్ర చేస్తున్నానని చెప్పగానే వాడు ఎంతో సంబరపడిపోయాడని చెప్పారు. నీల్‌కు అన్నిటికంటే రావణుడి పాత్రే ఎక్కువ ఇష్టమని తెలిపారు. ఈ సినిమా రెండో భాగం వచ్చేసరికి వాడికి ఐదేళ్లు వస్తాయని, థియేటర్‌లో వాడు చూడబోయే మొదటి చిత్రం ఇదే అవుతుందని కాజల్ చెప్పుకొచ్చారు. అలాగే 'ది ఇండియా స్టోరీ' సినిమా గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వాడకం వల్ల ప్రజల ప్రాణాలు ఎలా పోతున్నాయనే పాయింట్ ఇందులో చూపించారని కాజల్ తెలిపారు. ఈ కథ విన్నాక తనే స్వయంగా రీసెర్చ్ చేసి, వంటగదిలో ఏ వస్తువులు ఉంచాలి, తన కొడుకుకు ఎలాంటి ఆహారం ఇవ్వకూడదనే విషయాలపై కొన్ని గట్టి నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**